
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
శుక్రవారం, 7 జూన్ 2024







హోటళ్ల చెలగాటం!

- ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలు గాలికి...
- అపరిశుభ్ర వాతావరణంలో వంటశాలలు
- నిల్వచేసిన పదార్థాలు, కెమికల్స్ వాడకం
- ఆహార శాఖ అధికారుల తనిఖీల్లో బయటపడుతున్న డొల్లతనం
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఇదే తీరు
- కేసుల నమోదులో రాష్ట్రంలో ద్వితీయ స్థానం
- గతేడాది ఖమ్మంలో 14, భద్రాద్రి కొత్తగూడెంలో 8 కేసులు
- కేసులకు భయపడని బడా హోటళ్ల వ్యాపారులు

ఆహార ప్రియులతో ఆటలాడుతున్న నిర్వాహకులు

ఖమ్మం అంటేనే కమ్మనైన వంటకాలకు ప్రసిద్ధి. తెలంగాణ, ఆంధ్రా రాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్న ఖమ్మం జిల్లా... హోటళ్లు, రెస్టారెంట్ల వ్యాపారానికి కేరాఫ్‌గా మారింది. ఇక్కడి హోటళ్లలో ఇటు తెలంగాణ వంటకాలు, అటు ఆంధ్రా వంటకాలు ఆహారప్రియులకు నోరూరిస్తాయి. ఏపీ నుంచి హైదరాబాద్‌కు ప్రయాణంచేసే వాహనదారులు ఖమ్మంలో బ్రేక్ తీసుకొని భోజనం చేసి వెళ్లాల్సిందే. రకరకాల వంటకాలతో అనేక హోటళ్లు ఖమ్మం నగరంతో పాటు చుట్టుపక్కల కోట్లాది రూపాయల ఫుడ్ బిజినెస్‌ను విజయవంతంగా సాగిస్తున్నాయి. ఇక్కడివరకు బాగానే ఉన్నా.. హోటళ్లలో ఆహార పదార్థాల తయారీలో కొరవడుతున్న నాణ్యత ప్రమాణాలు ఆందోళన కలిగిస్తున్నాయి. అందమైన, ఆకర్షణీయమైన భవనాల్లో హోటళ్లను నడుపుతున్న నిర్వాహకులు... ఆహార పదార్థాల తయారీలో శుచి, శుభ్రతను పాటించక, కలుషిత ఆహారాన్ని వడ్డిస్తూ వినియోగదారులతో చెలగాటం ఆడుతున్నారు. ఇటీవల అధికారుల తనిఖీల్లో బయటపడిన హోటళ్ల నిర్వాకాలే ఇందుకు సాక్ష్యం. ఆహార తనిఖీ అధికారులు నమోదు చేసే కేసుల్లో ఖమ్మం జిల్లా రాష్ట్రస్థాయిలో రెండో స్థానంలో ఉండటం ఆందోళన కలిగిస్తోంది. వరుస తనిఖీలు జరుగుతున్నా హోటళ్ల నిర్వాహకులు తమ పద్ధతి మార్చుకోకుండా వ్యవహరిస్తుండటం మరింత ఆందోళన కలిగిస్తోంది.

వివరాలు : 6లో

- ఖమ్మం సంక్షేమ విభాగం





బాధితులకు ప్రాణ సంకటం!

నిర్లక్ష్యానికి కేరాఫ్ అడ్రస్‌గా మారిన జిల్లా జనరల్ ఆస్పత్రి క్యాజువాలిటీ

- విధులకు ఎగనామం పెడుతున్న వైద్యులు
- సొంత ప్రాక్టీసులకే ప్రాధాన్యం
- కిందిస్థాయి సిబ్బందికి బాధ్యతలు అప్పగింత
- బాధితుల ప్రాణాలతో చెలగాటం
- ప్రైవేటు ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్న సిబ్బంది

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 6: ప్రమాదంలో గాయాలైన క్షతగాత్రులు.. పాముకాటు బాధితులు.. ఆత్మహత్యాయత్నం... కత్తిపోట్లకు గురైన వారు.. కొన ఊపిరితో కొట్టు మిట్టాడుతూ ఆసుపత్రికి వచ్చిన సమయంలో ప్రాథమికంగా వైద్యం అందించి ప్రాణాలు కాపాడేది క్యాజువాలిటీ వైద్యులే. ప్రమాదం జరిగిన మొదటి గంటలో అందించే వైద్యమే ప్రాణాలను నిలబెడుతుంది. అయితే ఆస్పత్రిలో ఎంతో కీలకమైన క్యాజువాలిటీ విధులను కొందరు వైద్యులు నిర్లక్ష్యం చేస్తున్నారు. మరికొందరైతే బాధితులను చికిత్స కోసం కార్పొరేట్ ఆస్పత్రులకు రిఫర్ చేస్తూ చేతులు దులుపుకొంటున్నారు. ఖమ్మం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో నెలకొన్న దుస్థితి ఇది.

రోస్టర్లో ఒకరు.. డ్యూటీలో మరొకరు

క్యాజువాలిటీలో ఏ రోజు ఎవరు విధులు నిర్వహించాలనే విషయాన్ని ముందుగానే నిర్ణయిస్తారు. రోస్టర్ ప్రకారం ప్రతి రోజు మూడు షిఫ్టుల్లో వైద్యులు అందుబాటులో ఉండాలి. ఉదయం 8గంటలనుంచి మధ్యాహ్నం 2వరకు ఒక్కరు, మధ్యాహ్నం 2నుంచి రాత్రి 8గంటల వరకు, రాత్రి 8గంటల నుంచి మరునాడు ఉదయం తొమ్మిది వరకు ముగ్గురు సీఎంవోలు అందుబాటులో ఉండాలి. అత్యవసర సమయంలో వైద్యులు క్యాజువాలిటీలో విధులు నిర్వహించాల్సి ఉంటుంది. నిబంధనల ప్రకారం ఎవరికి కేటాయించిన సమయంలో వారే పని చేయాలి. కానీ ఎస్సార్‌లు, డీఆర్పీలు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. సొంతంగా నర్సింగ్ హోంలు, క్లినిక్‌లు ఉన్న వైద్యులు నిబంధనల ప్రకారం విధులు నిర్వహించాల్సి ఉన్నా.. వారికి బదులుగా మరో వైద్యుడిని నియమించుకుని ఇక్కడి విధులకు ఎగనామం పెడుతున్నారు. ఈ సమయంలో వారి సొంత నర్సింగ్ హోం, క్లినిక్‌లో ప్రాక్టీస్ చేసుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేకాదు కిందిస్థాయి సిబ్బందిపై బాధ్యతలు అప్పగించి వెళ్లిపోతున్నారని రోగులు వాపోతున్నారు.

కమీషన్ల కక్కుర్తి

ఖమ్మం జనరల్ ఆస్పత్రితో పాటు ఇతర ఏరియా ఆసుపత్రుల్లో ఏ రోగికీ ప్రాణం మీదకు వచ్చినా మెరుగైన వైద్యం కోసం

(మిగతా 6వ పేజీలో)



ఖమ్మంలో విత్తనాల షాపు వద్ద రైతుతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

విత్తనాల దుకాణాల్లో కలెక్టర్ తనిఖీ

- రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచన
- నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

ఖమ్మం వ్యవసాయం, జూన్ 6: నగరంలోని పలు విత్తన, ఎరువులు విక్రయ దుకాణాలను కలెక్టర్ వీపీ గౌతమ్ గురువారం తనిఖీ చేశారు. షాపుల్లోని స్టాక్ రిజిస్టర్, ఇన్వాయిస్, బిల్ బుక్కులను, గడువు తేదీల వివరాలను పరిశీలించారు. ఎరువులు, విత్తనాల అమ్మకాలకు తగిన అనుమతి పొందిన పత్రాలను పరిశీలించి దుకాణదారుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం షాపుల వద్దకు విత్తనాల కొనుగోలుకు వచ్చిన రైతులతో కలెక్టర్ మాట్లాడారు. ఏ పంట సాగు చేస్తున్నారు..? గత సీజన్‌లో ఏ పంట సాగు చేశారు..? అనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా అన్ని ఎరువులు, విత్తన దుకాణాలలో వ్యవసాయ, రెవెన్యూ, పోలీసు అధికారులతో కూడిన టాస్క్‌ఫోర్సు బృందాలు తనిఖీలు నిర్వహించాలన్నారు. నకిలీ, నాసిరకం విత్తనాలు, ఎరువుల కారణంగా ఎక్కడా ఏ ఒక్క రైతు నష్టపోకుండా క్షేత్రస్థాయిలో పకడ్బందీ పర్యవేక్షణ కొనసాగించాలని తెలిపారు. నకిలీ ఎరువులు, విత్తన విక్రయాలను సహించేది లేదన్నారు. ప్యాక్ చేసిన విత్తనాలు మాత్రమే రైతులు కొనాలని, లూజు విత్తనాలు, సీల్ తీసిన విత్తనాలు కొనవద్దని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు శ్రీనివాసరావు, ఖమ్మం అర్బన్ మండల వ్యవసాయాధికారి కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

విరిసిన 'కమలం'

- ఖమ్మం లోక్‌సభ ఎన్నికల్లో సత్తాచాటిన బీజేపీ
- అనూహ్యంగా పెరిగిన ఓటు బ్యాంకు
- బీఆర్‌ఎస్ ఓటుబ్యాంకుకు గండి
- కలిసొచ్చిన టీడీపీ, జనసేనతో పొత్తు
- 2019లో 20,480ఓట్లు.. 2024లో 1,18,636 ఓట్లు...



ఖమ్మం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఒకప్పుడు కమ్యూనిస్టులకు కంచుకోటగా ఉన్న ఖమ్మం గుమ్మంలో... కమలం వికసిస్తోంది. వామపక్ష ప్రభావిత జిల్లాగా ముద్రపడిన ఉమ్మడి ఖమ్మం జిల్లాలో క్రమంగా బీజేపీ బలపడుతోంది. ఒకపక్క బీజేపీ ఓటమే తమ లక్ష్యమని కమ్యూనిస్టు నేతలు సభలు, సమావేశాల్లో ప్రకటనలు చేస్తుండగా.. మరోవైపు మొగ్గలా ఉన్న బీజేపీ క్రమంగా వికసిస్తోంది. తాజా లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో ఈ విషయం స్పష్టమైంది. లోక్‌సభ ఎన్నికల్లో 50వేలకు మించి ఓట్లు పొందలేదనుకున్న బీజేపీ లక్షకుపైగా ఓట్లు పొందింది. ప్రతిపక్ష బీఆర్‌ఎస్ ఓటుబ్యాంకుకు గండికొట్టి బీజేపీ తన ఓట్లను పెంచుకోగలిగింది. ఖమ్మం, కొత్తగూడెం వంటి అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్‌తో సమానంగా బీజేపీ ఓట్లు పొందడం గమనార్హం. జిల్లాలో పోస్టల్ బ్యాలెట్లలో కాంగ్రెస్ తర్వాత రెండోస్థానం బీజేపీకే లభించింది. ఉమ్మడి రాష్ట్రంలో ఎన్డీఏ కూటమిలో టీడీపీ, బీజేపీ కూటమి ఉన్నప్పుడు 2014లో బీజేపీకి

అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా బీజేపీ ఓట్లు..

నియోజకవర్గం	2019 (లోక్‌సభ)	2023 అసెంబ్లీ	2024 (లోక్‌సభ)
ఖమ్మం	6,187	4,040	32,398
పాలేరు	2,129	1,815	12,648
మధిర	1,822	2,021	9,074
వైరా	1,689	2,712	11,806
సత్తుపల్లి	2,229	1,882	14,626
కొత్తగూడెం	4,848	1,945	27,240
అశ్వారావుపేట	1,497	2,281	9,283
పినపాక	----	2,627	15,170
ఇల్లెందు	----	2,568	12,494
భద్రాచలం	----	1,931	10,294

పినపాక నియోజకవర్గంలో 28,195ఓట్లు వచ్చాయి. 1996లో లోక్‌సభ ఎన్నికల్లో ఖమ్మం నుంచి బీజేపీ నుంచి పోటీచేసిన రవీంద్రనాయక్‌కు సైతం 1,17,926 ఓట్లు లభించాయి. మళ్లీ ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఆ రికార్డును అధిగమించి 1,18,636 ఓట్లు తాండ్ర వినోద్‌రావు సాధించారు. ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గంలో 2019లో బీజేపీకి 20,480 ఓట్లు వచ్చాయి. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం ఖమ్మం లోక్‌సభ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో జనసేనతో కలిసి పోటీ చేయగా ఆ కూటమికి 16,976 ఓట్లు మాత్రమే వచ్చాయి. కానీ తాజా లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమిలో భాగంగా టీడీపీ కూడా బీజేపీకి తోడవడంతో ఖమ్మం, మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల్లో ఆ పార్టీ అభ్యర్థులు భారీగా ఓట్లు పొందారు. ఖమ్మం లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ 1,18,636 ఓట్లు పొందింది. అలాగే మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో 2019 ఎన్నికల్లో 27,487 ఓట్లు రాగా 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 34,431ఓట్లు మాత్రమే వచ్చాయి. కానీ తాజా లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం ఆ పార్టీ 1,10,444ఓట్లు సాధించింది. ఉమ్మడి జిల్లాలో పది అసెంబ్లీ నియోజకవర్గాలతో పోలిస్తే ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గంలో బీజేపీ 32,398ఓట్లు సాధించింది. జిల్లాలో అత్యధికంగా ఖమ్మంలోనే ఆ పార్టీకి ఎక్కువ ఓట్లు వచ్చాయి. ఇక్కడ బీఆర్‌ఎస్‌తో సమానంగా బీజేపీ ఓట్లు పొందింది.

గ్రూప్-1 ప్రిలిమినరీకి బందోబస్తు

- పరీక్ష కేంద్రాల వద్ద 144వ సెక్షన్
- పోలీసు కమిషనర్ సునీల్‌దత్



ఖమ్మం క్రైం, జూన్ 6: ఖమ్మం కమిషనరేట్ పరిధిలో 9న జరిగే గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షల నేపథ్యంలో ఆయా పరీక్షా కేంద్రాల వద్ద 144వ సెక్షన్ అమల్లో ఉంటుందని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 52 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించే ఈ పరీక్షల సందర్భంగా ఉదయం 6గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఆంక్షలు అమల్లో ఉంటాయన్నారు. పరీక్షా కేంద్రాలకు 500 మీటర్ల దూరం వరకు ఐదుగురికి మించి గుంపులుగా ఉండరాదని ఎలాంటి సభలు, సమావేశాలు, దర్నాలు, ప్రచారాలు నిర్వహించరాదన్నారు. పరీక్ష సమయంలో పరిసరాల్లోని ఇంటర్‌నెట్ సెంటర్లు, జిరాక్సు సెంటర్లు, స్టేషనరీ దుకాణాలు మూసివేయాలన్నారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా ట్రాఫిక్ పోలీసులు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో వివిధ వర్గాల ప్రజలు, రాజకీయ పార్టీలు, వివిధసంఘాల నాయకులు, పోలీసులకు సహకరించాలని కోరారు. అదేవిధంగా పరీక్ష సమయంలో ఎటువంటి ఆటంకాలు లేకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా 144వ సెక్షన్ అమలు చేస్తున్నామని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు సంబంధిత నిఘాను నియమించి సమాచారం సేకరించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

నేటినుంచి వ్యవసాయ మార్కెట్ పునఃప్రారంభం

ఖమ్మం మార్కెట్, జూన్ 6: నగరంలోని వ్యవసాయ మార్కెట్ శుక్రవారం నుంచి పునఃప్రారంభం కానుంది. సుమారు 24రోజుల వేసవి సెలవుల అనంతరం మార్కెట్‌లో తిరిగి లావాదేవీలు జరగనున్నాయి. ఎండల తీవ్రత పెరగడంతో మిర్చి యార్డుల్లో పనులు చేయడం వ్యాపారులు, కార్మికులకు కష్టతరంగా మారి వడదెబ్బకు గురవుతున్న నేపథ్యంలో చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, కార్మిక సంఘాల కోరిక మేరకు ప్రతి సంవత్సరం వలే ఈ ఏడాది కూడా మే 14 నుంచి జూన్ 6 వరకు వేసవి సెలవులు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇక మార్కెట్‌లో శుక్రవారం నుంచి ఎప్పటి లాగా పత్తి, అపరాలు, మిర్చి యార్డులలో యథావిధిగా క్రయవిక్రయాలు ఉంటాయని మార్కెట్ అధికారులు తెలిపారు. రైతులు తమ పంటలను మార్కెట్‌కు సకాలంలో తీసుకొచ్చి అమ్ముకోవాలని కోరారు.



ఖమ్మం రైల్వేస్టేషన్‌ను తనిఖీ చేస్తున్న డీఆర్‌ఎం గోపాల్ నాయక్

ఆధునీకరణ పనులు వేగిరం చేయాలి

- లిఫ్ట్, ఎస్కలేటర్ల నిర్వహణ సజావుగా ఉండాలి
- సికింద్రాబాద్ రైల్వే డీఆర్‌ఎం గోపాల్‌నాయక్
- ఖమ్మం రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనుల పరిశీలన

వివరాలు : 7లో



నల్లగొండలో కౌంటింగ్ కేంద్రం వద్ద కాంగ్రెస్ అభ్యర్థి మల్లన్న

ఉత్కంఠగా 'పట్టభద్రుల' కౌంటింగ్

- కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు 18,565 ఓట్ల ఆధిక్యం
- మొదటి ప్రాధాన్యంలో ముందంజ
- ద్వితీయ స్థానంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డి
- మొదటి ప్రాధాన్యంలో ఎవరికీ రాని కోటా ఓటు
- ద్వితీయ ప్రాధాన్య ఓట్ల లెక్కింపు ప్రారంభం
- పాలకూరి అశోక్‌కుమార్, గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి ఓట్లే కీలకం

వివరాలు : 6లో

బడిబాటను విజయవంతం చేయాలి

ఖమ్మం జిల్లా అదనపు కలెక్టర్ సత్యప్రసాద్

ఖమ్మం ఖానాపురంహవేలి/ ఖమ్మం కలెక్టరేట్, జూన్ 6: రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ సత్యప్రసాద్ వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. ఖమ్మం లోని జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడిఓసి)లో గురువారం నిర్వహించిన సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడుతూ మార్గదర్శనం చేశారు. ప్రభుత్వ పాఠశాలలలో, సంక్షేమ వసతి గృహాలలో స్వచ్ఛత ,పరిశుభ్రత కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాలకు పంచాయతీరాజ్ , నగరపాలక సంస్థలు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. మండల స్థాయిలో ఎండివోలు సంబంధిత శాఖల అధికారులతో వెంటనే సమావేశాన్ని నిర్వహించాలని మండల స్థాయి అధికారులకు క్లస్టర్ల వారీగా బాధ్యతలు అప్పగించి అన్ని పాఠశాలలు బడిబాట కార్యక్రమంలో సందర్శించాలని తెలిపారు. ఈ నెల 12న పాఠశాలలు పున ప్రారంభం అయ్యేలోగా పాఠ్యపుస్తకాలు నోట్ పుస్తకాలు యూనిఫామ్ దుస్తులు పాఠశాలలకు అందేలా చర్యలు తీసుకోవాలని డీఈఓ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర్ శర్మ జిల్లా పరిషత్ సీఈవో వినోద్, డీఆర్డీవో సన్యాసయ్య, మిషన్ భగిరథ ఈఈ పుష్పలత, కార్మిక, విద్యుత్, పంచాయతీ రాజ్, మున్సిపల్ తదితర శాఖల అధికారులు జిల్లా సమగ్ర శిక్ష కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

నూరుశాతం పిల్లలను
పాఠశాలల్లో చేర్పించడమే లక్ష్యం: డీఈవో

ఖమ్మం ఖానాపురం హవేలి, జూన్ 6: విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు మౌలిక సదుపాయాలు కల్పించడం కోసం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర్ శర్మ తెలిపారు. ఖమ్మం నగరంలోని బాలాజీనగర్‌లో బడిబాట కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులు, వివిధ శాఖల సిబ్బంది, విద్యా కమిటీల సభ్యులతో నిర్వహించిన సమావేశంలో బడిబాట కార్యక్రమం ఆవశ్యకతను తెలిపారు. పిల్లలను గుర్తించి వారిని నూరుశాతం ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమన్నారు. ఈనెల 12న పాఠశాలలు పునఃప్రారంభం అవుతాయన్నారు. ఈలోగా పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు యూనిఫామ్ అందేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. పాఠశాలల్లో తగిన వసతులు ఏర్పాటు చేయాలని, వీటికి సంబంధించి ప్రచార కార్యక్రమాలు, ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. బడిబాట కార్యక్రమం గురువారం నుంచి 19వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. తనికెళ్లలో జరిగిన బడిబాట కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ సీఎంవో యలగందుల రాజశేఖర్ పాల్గొన్నారు. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

హోటళ్ల చెలగాటం!

ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 6: హైదరాబాద్ తర్వాత ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే హోటల్ రెస్టారెంట్ వ్యాపారం జోరుగా సాగుతోంది. రుచుల్లో ఎంతటి ఖ్యాతి పొందిందో.. కనీస ప్రమాణాలు పాటించక పోవటంలోనూ అదే అపవాదును మూటగట్టుకుంటోంది. ఆహార పదార్థాల తయారీలో కనీస ప్రమాణాలు పాటించక పోవడం... కలుషిత ఆహారాన్ని వినియోగదారులకు వడ్డించడం.. వంటి ఘటనలు ఇటీవల విరివిగా వెలుగు చూస్తున్నాయి. హోటళ్ల నిర్వాహకుల నిర్వాకాలపై భోజన ప్రియులు రాష్ట్ర స్థాయిలో ఆహార నాణ్యతా ప్రమాణాల డైరెక్టర్ వరకు ఫిర్యాదులు చేయటంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో హోటల్స్ నిర్వహణ పైన పటారం.. లోన లొటారంగా ఆవిష్కారమైంది.

కేసుల్లో ద్వితీయ స్థానం

తెలంగాణ రాష్ట్రంలో జిల్లా స్థాయిలో ఆహార నాణ్యతా ప్రమాణాల లోపంలో రాష్ట్రస్థాయిలో ఉమ్మడి ఖమ్మం జిల్లా ద్వితీయ స్థానం దక్కించుకొంది. ఎక్కువ కేసులు ఉమ్మడి నల్గొండ జిల్లాలో నమోదు కాగా, తర్వాత స్థానంలో ఖమ్మంలో 14 కేసులు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 8కేసులు నమోదయ్యాయి. వాటిలో ఖమ్మం, తల్లాడ, సత్తుపల్లి, కొత్తగూడెం, పాల్వంచ, మణుగూరు, అశ్వారావుపేట వంటి పట్టణాలు ఉన్నాయి. క్యాన్సర్ వ్యాధికి కారకాలైన రంగులు, మసాలాలు, దినుసులు వాడటం, నాణ్యత లేని మాంసం, పెరుగు, బెల్లం వంటి వాటిపై కేసులు నమోదు చేశారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భోజన హోటల్స్ ఖమ్మంలో 70, భద్రాచలంలో 45, ఖమ్మం జిల్లాలో రెస్టారెంట్లు 58, భద్రాచలంలో 42 వరకు ఉన్నాయి. ఇక నాలుగు చక్రాల వాహనాలపై ఖమ్మంలో 700, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 450 మంది వరకు ఆహార పదార్థాల వ్యాపారం జరుగుతుంది. అయితే చాలా హోటళ్లలో ఆహార పదార్థాల తయారీలో శుచి, శుభ్రత పాటించడం లేదనే ఆరోపణలున్నాయి. ఆహార వ్యాపారానికి అనుమతి ఇచ్చే సమయంలో ఆహార నాణ్యతా ప్రమాణాల శాఖ అధికారులు జారీ చేసే నాణ్యతా ప్రమాణాల నిబంధనలను హోటల్ నిర్వాహకులు బేఖాతరు చేస్తూ దర్జాగా వ్యాపారం చేస్తున్నారు.

భోజన హోటల్స్ రెస్టారెంట్లకు ఏడాదికి రెండు పర్యాయాలు వంటశాలలకు తెల్లటి రంగులు వేయాల్సి ఉంటుంది. ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా ఫ్లోరింగ్ పరిశుభ్రంగా ఉండాలని ఆదేశాలున్నాయి. ఇక వంటశాలలో పనులు చేసే వారు తలకు క్యాప్స్, చేతులకు గ్లౌజ్‌లు, నోటికి మాస్కులు ధరించాలి. చేతులకు కడియాలు, తాళ్లు, గాజులు, ఉంగరాలు ఉండకూడదు. వంటశాలలోని పాత్రలు పరిశుభ్రంగా ఉండాలి. కానీ ఖమ్మం నగరంలోని రెస్టారెంట్లలో ఇటువంటి ఆదేశాలు అమలు కావటంలేదని అధికారుల తనిఖీల్లో బయట పడింది. రహదారి పక్కన ఉండే రూ.99కే బిర్యాని పాయింట్ల నుంచి రూ.500కు బిర్యానీ బడా రెస్టారెంట్ల వరకు వంటశాలల్లో కనీస నాణ్యతా ప్రమాణాలు పాటించటం లేదు. ఇటీవల ఓ రెస్టారెంట్‌ను తనిఖీ చేసిన ఆహార తనిఖీ అధికారులు నివ్వెరపోయారు. ఆ రెస్టారెంట్‌లోని వంటశాలకు ఒక వైపు కనీసం ఎటువంటి గోడ, పరదా అడ్డులేకుండా ఓపెన్‌గా వీధి వైపు తెరిచి ఉంది. ఇదే హోటల్‌లో బిర్యానీలో బొద్దింకలు పడటంతో విషయం వెలుగులోకి వచ్చింది.

కేసులంటే భయమే లేదు..

గత ప్రభుత్వంలో జిల్లా ఆహార తనిఖీ అధికారులు ఖమ్మంలోని ఇల్లెందు క్రాస్ రోడ్డులోని టీటీడీసీ ఎదురుగా ఉన్న, బిర్యానీలో పేరు పొందిన రెస్టారెంట్‌పై కేసు నమోదు చేశారు. కేసు జిల్లా కోర్టు వరకు వెళ్లింది. దీంతో రెస్టారెంట్ నిర్వాహకులు గత ప్రభుత్వంలోని మంత్రి వద్ద పనిచేసే ఉద్యోగితో సిఫార్సులు చేయించుకొని కేసులు తొలగించుకున్నారు. తర్వాత కాలంలో బడా వ్యాపారులు ఇదే తీరును జిల్లా ఆహార తనిఖీ అధికారులపై చూపిస్తున్నారు. ఇటీవల ఖమ్మం కొత్త బస్టాండ్ ముందు ఓ ప్రముఖ రెస్టారెంట్‌ను ఆహార తనిఖీ అసిస్టెంట్ కమిషనర్ జ్యోతిర్మయి ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆహార పదార్థం శ్యాంపిల్స్ సేకరించారు. కేసు ప్రాథమిక విచారణకు సంతకాలు చేయాలని కోరగా హోటల్స్ నిర్వాహకులు మేమెందుకు చేయాలని తాత్కాలిక సిబ్బందితో సంతకాలు చేయించారు.

ఫిర్యాదు చేస్తేనే తనిఖీలు

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆహార తనిఖీశాఖలో ఖమ్మం జిల్లా స్థాయిని గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ స్థాయి నుంచి అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ స్థాయి వరకు క్యాడర్, కార్యాలయం స్థాయిని పెంచారు. కానీ ఆ మేరకు అధికారుల నియామకం జరగలేదు. జిల్లాలో అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్, గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్, ఇన్‌స్పెక్టర్, ముగ్గురు అటెండర్లు ఉండాలి. కానీ ఒక గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ మరో టైపిస్టు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. దీంతో వీరు ఫిర్యాదు చేసిన రెస్టారెంట్లు, హోటల్స్‌పై మాత్రమే తనిఖీలు చేస్తున్నారు. ఖమ్మం నగరంలోని పాత బస్టాండ్, ఇల్లెందు క్రాస్ రోడ్డు, వైరా రోడ్డు, బైపాస్ రోడ్డు, మమత రోడ్డులో ఇలా అన్ని రహదారుల వెంట బడా రెస్టారెంట్లు ఉన్నా.. వాటిలో కనీసం తనిఖీలు చేపట్టటం లేదు.



ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

వంటశాలలోకి వెళ్లే హక్కు ఉంది..

కిరణ్‌కుమార్, గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్

హోటల్స్, రెస్టారెంట్లలోకి వెళ్లిన వినియోగదారులకు తాము కొనుగోలు చేసే ఆహార పదార్థం తయారీని పరిశీలించుకునే హక్కు ఉంది. వినియోగదారుడు నేరుగా రెస్టారెంట్‌లోని వంటశాలలోకి వెళ్లే అనుమతి ఉంది. వంటశాలలను ఏడాదికి రెండుసార్లు తెలుపు రంగులు వేయాలి. ఐఎల్ఆర్ ఫ్రీజ్‌లను మాత్రమే వినియోగించాలి. వంట మనుషులు శుభ్రత పాటించాలి. వారి చేతులపై ఎటువంటి వస్తువులు, తాళ్లు, కడియాలు, గాజులు ఉండకూడదు. తప్పనిసరిగా తలకు క్యాప్ ధరించాలి. చేతులకు గ్లౌజ్‌లు, నోటికి మాస్కులు పెట్టుకోవాలి. రెస్టారెంట్‌లో ఆహారం తయారీకి ఎటువంటి పదార్థాలు వినియోగించేది వినియోగదారులకు కనిపించేలా నోటీసు బోర్డులో ఉంచాలి. ఇవేవీ లేకపోయినా అధికారులుకు ఫిర్యాదు చేయవచ్చు.

ఉత్కంఠగా 'పట్టభద్రుల' కౌంటింగ్

నల్లగొండ, జూన్ 6(ఆంధ్రజ్యోతిప్రతినిధి): నల్లగొండ-వరంగల్-ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపులో గురువారం రాత్రికి మొదటి ప్రాధాన్య ఓట్ల లెక్కింపు పూర్తయ్యేసరికి కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న(చింతపండు నవీన్‌కుమార్) 18,565 ఓట్ల ఆధిక్యంలో ఉన్నారు. అయనకు 1,22,813 మొదటి ప్రాధాన్య ఓట్లు వచ్చాయి. బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగు రాకేష్‌రెడ్డి 1,04,248 ఓట్లతో ద్వితీయ స్థానంలో ఉన్నారు. రాకేశ్‌రెడ్డి కంటే మల్లన్నకు 18,565 ఓట్ల ఆధిక్యత లభించింది. బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి 43,313 మొదటి ప్రాధాన్య ఓట్లతో మూడోస్థానంలో ఉండగా, నల్లగొండకు చెందిన స్వతంత్ర అభ్యర్థి అశోక్‌కుమార్ 29,697మొదటి ప్రాధాన్య ఓట్లు సాధించి నాలుగోస్థానంలోకి వచ్చారు. మొదటి ప్రాధాన్య ఓట్లలో గతానికి భిన్నంగా అత్యధికంగా 25,824 చెల్లని ఓట్లు ఉన్నాయి. మొత్తం చెల్లిన ఓట్ల ఆధారంగా 1,55,095 ఓట్లను కోటా ఓటుగా రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన ప్రకటించారు. మొదటి ప్రాధాన్య ఓట్లలో ఆధిక్యత సాధించిన కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న కోటా ఓటు సాధించాలంటే ఆయనకి ద్వితీయ ప్రాధాన్య ఓట్లలో 32,282ఓట్లు రావాల్సి ఉంది. అదే రాకేష్‌రెడ్డి గెలవాలంటే 50,847ఓట్లు రావాల్సి ఉంది. ఉప ఎన్నిక కౌంటింగ్ శుక్రవారం సాయంత్రానికి ముగిసే అవకాశం ఉంది.

నేటి రాత్రికి ఫలితం వచ్చే అవకాశం

ఉప ఎన్నికలో మొత్తం 52మంది అభ్యర్థులు బరిలో ఉన్నా నలుగురికి మినహా మిగిలిన అందరికీ అతి తక్కువ ఓట్లే వచ్చాయి. అతి తక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థి నుంచి ఎలిమినేషన్ మొదలుపెట్టి వారి ద్వితీయ ప్రాధాన్య ఓట్లను పోటీలో ఉన్న ఇతర అభ్యర్థులకు కలుపుతూ వస్తారు. ఇలా ప్రధాన అభ్యర్థులు మినహా మిగిలిన 48మంది అభ్యర్థుల ఓట్లు కలిపినా కోటా ఓటు వచ్చే అవకాశం ఉండదు. అయితే ఈ 48మంది అభ్యర్థుల ఎలిమినేషన్ ప్రక్రి య శుక్రవారం ఉదయం వరకు కొనసాగే పరిస్థితి ఉంది. ఇదే సమయంలో మూడో రౌండ్ ఓట్ల కౌంటింగ్‌పై తమకు అనుమానాలున్నాయని, మళ్లీ లెక్కించాలని బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డి డిమాండ్ చేయడంతో వాతావరణం వేడెక్కింది. ఎన్నికల సంఘం ఆయన డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకుంటుందా? లేదా? అనే అంశం తేలాల్సి ఉంది.

విజేతను తేల్చేది ఆ ఇద్దరి ద్వితీయ ప్రాధాన్య ఓట్లే

స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచిన నల్లగొండకు చెందిన పాలకూరి అశోక్‌కుమార్, బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి ఎలిమినేట్ అయ్యాక, వారి బ్యాలెట్లలోని ద్వితీయ ప్రాధాన్య ఓట్లే విజేతను తేల్చే అవకాశముందని భావిస్తున్నారు. స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగిన అశోక్‌కుమార్, 48 మంది స్వతంత్ర అభ్యర్థుల తర్వాత ఎలిమినేట్ అవుతారు. ఆయన ఓట్లలో కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులకు ఎవరికి ఏ స్థాయిలో ద్వితీయ ప్రా ధాన్య ఓట్లు వస్తాయనే అంశం కీలకం కానుంది. అయితే కౌంటింగ్ సరళిని పరిశీలిస్తున్న రాజకీయనేతలు, పరిశీలకులు అశోక్‌కు మార్‌కు చెందిన బ్యాలెట్ల ద్వితీయ ప్రాధాన్య ఓట్లతో కోటా ఓటు ఎవరికీ రాదని, బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డి ఎలిమినేషన్ తప్పదని భావిస్తున్నారు. ఆయన బ్యాలెట్ల ద్వితీయ ప్రాధాన్య ఓట్ల లెక్కింపు పూర్తయ్యాక కోటా ఓటు రావచ్చని అంచనా వేస్తున్నారు.

అభ్యర్థి (పార్టీ)	మొదటి రౌండ్	రెండో రౌండ్	మూడో రౌండ్	నాలుగో రౌండ్	మొత్తం
తీన్మార్ మల్లన్న (కాంగ్రెస్)	36,210	34,574	35450	16,579	1,22,813
ఏనుగు రాకేష్‌రెడ్డి (బీఆర్ఎస్)	28,540	27,574	31242	16,892	1,04,248
గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి (బీజేపీ)	11,395	12,843	10278	8,797	43,313
పాలకూరి అశోక్ (స్వతంత్ర)	9,109	11,214	7170	2,204	29,697
చెల్లని ఓట్లు	7,728	7,398	8,658	2,040	25,824

మొత్తం ఓట్లు	4,63,839
పోలైన ఓట్లు	3,36,013
అభ్యర్థుల సంఖ్య	52
మొదటి ప్రాధాన్య ఓట్ల లెక్కింపు వివరాలు	
చెల్లని ఓట్లు	25,824
చెల్లిన ఓట్లు	3,10,189
కోటా ఓటు	1,55,095

అయితే అప్పటికీ కోటా ఓటు రాకపోతే రెండో స్థానంలో ఉండే అభ్యర్థికి వచ్చిన ద్వితీయ ప్రాధాన్య ఓట్లనూ లెక్కిస్తారు. అప్పటికీ కోటా ఓటు రాకపోతే అనూహ్యంగా తృతీయ ప్రాధాన్య ఓట్లను లెక్కించాల్సి ఉం టుంది. గరిష్ఠంగా ద్వితీయ ప్రాధాన్య ఓట్లలో ఫలితం తేలుతుందని అంచనా వేస్తున్నారు.

చెమటలు పట్టించిన చెల్లని ఓట్లు

మొదటి ప్రాధాన్య ఓట్లలో చెల్లని ఓట్లు అత్యధికంగా నమోదవడం ప్రధాన పార్టీల అభ్యర్థులను చెమటలు పట్టిస్తున్నాయి. గతంలో ఎన్నడూలేని రీతిలో పోలైన ఓట్లలో దాదాపు 8.50శాతం ఓట్లు చెల్లకుండా పోయాయి. మూడో రౌండ్ వరకే 23,784 ఓట్లు చెల్లకుండా పోగా, ప్రధాన అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేశారు. నాలుగో రౌండ్ ముగిసే సరికి 25,824ఓట్లు చెల్లకుండా పోయాయి. ఎంతో అవగాహన ఉన్న గ్రాడ్యుయేట్ల ఓట్లే ఈ స్థాయిలో చెల్లకుండా పోవడమేంటని ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాలెట్ పేపర్లపై అడ్డగోలు రాతలు, సంతకాలు, ఫోన్ నెంబర్లు, ప్రాధాన్య ఓటు ఇవ్వడంలో నిర్లక్ష్య వైఖరి వంటి కారణాలతో ఓట్లు చెల్లకుండా పోయాయి. చెల్లని ఓట్లు అధికంగా ఉండడం వల్లే మొదటి ప్రాధాన్య ఓట్లతో కోటా ఓటు ఎవరికీ రాలేదని, అనివార్యంగా ద్వితీయ ప్రాధాన్య ఓట్లకు వెళ్లాల్సి వచ్చిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది....

బాధితులకు ప్రాణసంకటం!

(5వ పేజీ తరువాయి)

జిల్లా ఆసుపత్రికి రిఫర్ చేస్తారు. దీనికితోడు జిల్లాలో ఎక్కడ రోడ్డు ప్రమాదం జరిగినా 108 అంబులెన్స్ క్షతగాత్రులను మొదట జిల్లా ఆసుపత్రికే తీసుకువస్తారు. ఇక్కడి వైద్యం నచ్చనివారు క్యాజువాలిటీ నుంచి ప్రైవేట్ ఆసుపత్రికి వెళతాడు. ఇదే అదునుగా భావించిన కొందరు వైద్యులు, సిబ్బంది, వార్డుబాయ్స్, అంబులెన్స్ డ్రైవర్లు కొన్ని ప్రైవేటు ఆస్పత్రులకు రిఫర్ చేస్తూ కమీషన్లు తీసుకుంటున్నారన్న విమర్శలున్నారు. ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చిన వారిని వారి సొంత ఆస్పత్రులకు కూడా మళ్లించుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పోస్టుమార్టం విధులు తప్పాయి....

గతంలో క్యాజువాలిటీ విధులు నిర్వహించే సీఎంవోలు తప్పనిసరిగా పోస్టుమార్టం విధులు నిర్వర్తించాల్సి వచ్చేది. కానీ ప్రస్తుతం మెడికల్ కళాశాల పరిధిలోకి వెళ్లిన తర్వాత ఆ బాధ తప్పినట్లయింది.

ప్రస్తుతం పోస్టుమార్టం నిర్వహించే బాధ్యతలను ఫోరెన్సిక్ వైద్యులను ప్రత్యేకంగా నియమించారు. జనవరి నుంచి ఫోరెన్సిక్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆ విధులను నిర్వహిస్తున్నారు. కానీ క్యాజువాలిటీలో మాత్రం అత్యవసర సేవలు నిర్వహించడంలో వైద్యులు పూర్తి అలక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ రోగులు ఆవేదన చెందుతున్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన 'రాయల'



పుష్పగుచ్ఛం అందజేస్తున్న రాయల

ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 6: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. గురువారం హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో రేవంత్ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ఖమ్మం ఎంపీగా రామసహాయం రఘురాంరెడ్డిని అత్యధిక మేజార్టీతో గెలిపించారని రాయల నాగేశ్వరరావును అభినందించారు.

ఎవరెస్ట్ అధిరోహకుడికి ఆర్థిక సాయం



చెక్కును అందజేస్తున్న రమాజ్యోతి

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 6: ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహిస్తున్న తెలుగు తేజం భూక్యా యశ్వంత్‌కి బిలీఫ్ ఆస్పత్రి ఎండీ, లీఫ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు మేడింపూడి రమాజ్యోతి రూ.50వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. పర్వతాధిరోహణ గురించి, వాతావరణ అనుకూలతలు గూర్చి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా యశ్వంత్‌ను అభినందించారు. మొదలు పెట్టిన కార్యాన్ని దిగ్విజయంగా పూర్తి చేయాలనీ ఆకాంక్షించారు. లీఫ్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ. 50వేల చెక్కును ఆమె అందజేశారు. ఈ సందర్భంగా యశ్వంత్ లీఫ్ ట్రస్ట్ ఆర్థిక సహాయానికి కృతజ్ఞతలు తెలిపారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో కాంట్రాక్టు కార్మికుల నిరసన

భద్రాచలం, జూన్ 6: భద్రాచలంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో పని చేస్తున్న కాంట్రాక్టు సిబ్బందికి గత ఐదు నెలల వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలని కోరుతూ గురువారం సీఐటీయు ఆధ్వర్యంలో ఏరియా వైద్యశాల ఎదుట కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా అధ్యక్షులు కె.బ్రహ్మాచారి మాట్లాడుతూ వైద్యశాలకు కొత్త కాంట్రాక్టర్ వచ్చిన దగ్గర నుంచి కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఫిబ్రవరి నెలలో ధర్నా చేసినప్పుడు వేతనాలు తక్షణమే చెల్లిస్తామని ఐటీడీఏ పీవో, వైద్యశాల సూపరింటెండెంట్‌లు హామీ ఇచ్చినా ఇంత వరకు నెరవేర్చలేదన్నారు. పదో తేదీలోపు వేతనాలు చెల్లించకపోతే నిరవధిక సమ్మెకు దిగుతామని పేర్కొన్నారు. దీంతో స్పందించిన ఏరియా వైద్యశాల ఆర్ఎంవో రాజశేఖర్ ఆందోళన చేస్తున్న వారితో చర్చలు జరిపారు. ఈ నెల తొమ్మిదో తేదీలోపు వేతన బకాయిలను ఖాతాల్లో జమ చేసేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గడ్డం స్వామి, బండారు శరత్‌బాబు, రామారావు, సంతోష్‌కుమార్, భూపేందర్, రమా, కృష్ణ శ్రీకాంత్, రమాదేవి, నరసింహారావు పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

విద్యార్థులకు అన్ని సౌకర్యాలూ కల్పించాలి: పీవో

భద్రాచలం, జూన్ 6: గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థులకు అన్ని రకాల వసతి సౌకర్యాలు కల్పిస్తున్నామని భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్ అన్నారు. గురువారం భద్రాచలం పట్టణలోని గిరిజన సంక్షేమ డిగ్రీ, ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థినిల కోసం సమకూర్చిన వసతి సౌకర్యాలను పీవో పరిశీలించారు. డార్మెట్రీ, తరగతి గదులు, మరుగుదొడ్లు, వాష్‌రూమ్‌లను తనిఖీ చేశారు. అనంతరం పీవో ప్రతీక్ జైన్ మాట్లాడుతూ ప్రస్తుతం విద్యార్థినులందరికీ సరిపడా మంచాలు ఉండాలని, ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు కొన్ని రూములలో లేనందున ఆశ్రమ పాఠశాలకు 25 ఫ్యాన్లు, 25 ట్యూబ్‌లైట్లు, డిగ్రీ కళాశాలకు 20 ఫ్యాన్లు, 20 ట్యూబ్‌లైట్లు వెంటనే సరపరా చేయాలని అన్నారు. పాఠశాల, కళాశాలలో అక్కడక్కడ పగుళ్లు తేలి ఉన్నాయని ప్యాచ్ వర్క్ చేయించాలని, చీమలు రాకుండా ఏర్పాట్లు చేయాలన్నారు.



మరుగుదొడ్లను పరిశీలిస్తున్న పీవో

ఈ కార్యక్రమంలో డీడీ మణెమ్మ, వార్డెన్లు పార్వతి, లక్ష్మి, సుభద్ర, రమణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా

రుద్రంపూర్, (సింగరేణి) ఏప్రిల్ 6 : సింగరేణి యాజమాన్యానికి అద్దె వాహనాలు నడుపుతున్న భూ నిర్వాసితులు వాహన యజమానుల అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అద్దె వాహనాలు ఎదుర్కొంటున్న ప్రధానమైన సమస్యలను పరిష్కరించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వన్‌టౌన్ సీఐ కరుణాకర్ సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో చర్చలు జరిపారు. వాహనదారుల సమస్యలను యాజమాన్య దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వాహనదారులు, సింగరేణి ఉన్నతాధికారులతో సమస్యలపై చర్చలు జరిగాయి. చర్చలు శుక్రవారంకు వాయిదా పడ్డాయి. ఈ చర్చలో జనరల్ మేనేజరు పర్సనల్ బీఆర్. దీక్షితు లు, డీజీఎం అజయ్, ట్రాన్స్‌పోర్టు జీఎం జగన్‌మోహన్‌రావు, జీఎం ఎంఎస్ సురేష్‌బాబు, అధికారులు వైవీఎల్ వర ప్రసాద్, వెంకయ్య, రామశేషయ్య, తిరుపతి, రాజశ్వరితోపాటు అద్దెవాహనదారులు యాజమానులు తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీలో అంతర్గత విభేధాలు

పాలకవర్గ సమావేశం వాయిదా

ఖమ్మంవ్యవసాయం, జూన్6: జిల్లా కేంద్రసహకార బ్యాంకులో అంతర్గత విబేధాలు భగ్గుమన్నాయి. ఇటీవల కాలంలో జరిగిన బ్యాంకు అధికారుల బదిలీల అంశంపై ప్రధానంగా పాలకవర్గ సభ్యులు ఆగ్రహంతో ఉన్నారు. ఈ నేపథ్యంలో గురువారం జరగాల్సిన డీసీసీబీ పాలకవర్గ సమావేశం వాయిదా పడింది. సుమారు మెజారిటీ డైరెక్టర్లు ఈవాయిదాను బాయ్‌కాట్ చేసి సమావేశానికి హాజరుకాలేదు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం బ్యాంకు ఆవరణలో కొంత సందిగ్ధత వాతావరణం ఏర్పడింది. వచ్చిన కొందరు డైరెక్టర్లు సైతం సమావేశానికి హాజరుకాకుండా తిరిగి వెళ్లిపోవడంతో డీసీసీబీలో ఏం జరుగుతుందోనని చర్చనీయాశంగా మారింది. గత పాలకవర్గ చైర్మన్‌ను అవిశ్వాసం పెట్టి పదవి నుంచి దింపిన వైస్‌చైర్మన్‌గా ఉన్న దొండపాటి వెంకటేశ్వరరావుకు చైర్మన్ బాధ్యతలు అప్పగించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో మరోవైపు కొందరు పాలకవర్గ సభ్యులు ఎన్నికలు నిర్వహించాలంటూ ప్రతిపాదనలు పెట్టడం, మరోవైపు బ్యాంకుల అధికారుల బదిలీల్లో కనీస సమాచారం పాలకవర్గ సమావేశంలో అజెండాగా పెట్టకుండా ఇష్టానుసారంగా బదిలీలు జరిగాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో డీసీసీబీ పాలకవర్గంలో ఏం జరగబోతుందోనని ఉత్కంఠ వాతావరణం నెలకొంది. మరోవైపు అసమ్మతి పాలకవర్గసభ్యులు బ్యాంకు ఆవరణలోని గెస్ట్‌హౌస్‌లో సమావేశం నిర్వహించి బాయ్‌కాట్ చేసినట్టు పలువురు పాలకవర్గ సభ్యులు పేర్కొంటున్నారు. పాలకవర్గ సభ్యులకు కనీస సమాచారం, ఇవ్వకుండా అగౌరవ పరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గ్రూప్ 1 ప్రిలిమ్స్ కట్టుదిట్టంగా నిర్వహించాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ శాంతికుమారి

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 6: ఈ నెల 9న నిర్వహించనున్న గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షకు కట్టుదిట్టంగా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అధికారులను ఆదేశించారు. గురువారం ఆమె తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్, రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో కలిసి గ్రూప్ -1 ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహణ, వానాకాలం పంట సీజన్ విత్తనాలు, ఎరువుల లభ్యత, మిషన్ భగిరథ త్రాగు నీటి సరఫరా, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫామ్ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఖమ్మం జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్‌తో కలిసి ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి మాట్లాడుతూ అధికారులు ఏలాంటి తప్పిదాలు జరుగకుండా, గతంలో నిర్వహించిన పరీక్షల అనుభవంతో గ్రూప్1 ప్రిలిమ్స్ పరీక్షను నిర్వహించాలన్నారు. వానాకాలం పంట సీజన్ ప్రారంభమవు తుందని, రైతుల కు అవసరమైన అన్ని రకాల విత్తనాలు, ఎరువుల స్టాక్ మన రాష్ట్రంలో ప్రతి జిల్లాలో సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని, వాటి పంపిణీలో ఎక్కడా ఇబ్బందులు రాకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలని కోరారు. వేసవికాలంలో ఎటువంటి ఇబ్బందీ లేకుండా తాగునీటిని విజయవంతంగా సరఫరా చేయడంలో అధికారులు సఫలీకృతులయ్యారని, ఇదే స్ఫూర్తితో రాబోయే 20 రోజులలో సైతం అప్రమత్తంగా ఉంటూ ప్రతి ఇంటికి త్రాగునీరు సరఫరా అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. కలెక్టర్ వీపీ గౌతమ్ మాట్లాడుతూ, గ్రూప్-1 పరీక్షల నిర్వహణకు ఖమ్మం జిల్లాలో 52 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు, 18403 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు తెలిపారు.

ఆపరేషన్ పహార్‌కు రోప్‌వే

ఛత్తీస్‌గఢ్‌లో ఘటన.. చింతవాగుపై నిర్మాణం

చర్ల, జూన్ 6: ఆపరేషన్ పహార్‌లో భాగంగా బలగాలు వాగును దాటేందుకు ఓ రోప్‌వేనే నిర్మించారు. ఈ కట్టడం చర్ల మండల సరిహద్దులోని ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా పామేడు చింతవాగుపై బలగాలు ఏర్పాటు చేశాయి. పామేడు గ్రామ శివారులో చింతవాగు ఉంది. ఈ వాగు దండకారణ్యంలో నే అతి పెద్ద వాగు. ఈ వాగుపైన సుమారు 40 నుంచి 50 గ్రామాలు ఉన్నాయి. ఈ ప్రాతం అంతా మావోయిస్టులకు కంచుకోట, నిత్యం మావోయిస్టుల కదలికలు కనిపిస్తాయి. దీంతో చింత వాగు ఎగువ ప్రాంతంలో ధర్మారం పేరుతో సీఆర్‌పిఎఫ్ 151 బెటాలియన్ క్యాంపుని ఏర్పాటు చేశారు. కాగా చింత వాగుపై బ్రిడ్జి నిర్మాణం మొదలు పెట్టినా ఇప్పటి వరకు పూర్తి కాలేదు. దీంతో వర్షాలు కురుస్తుండడంతో వాగు ప్రవహిస్తోంది. భారీగా వర్షాలు కురిస్తే క్యాంపుకు రాక పోకలు, యాంటీ నక్సల్స్ ఆపరేషన్ నిలిచిపోతాయి. దీంతో సీఆర్‌పీఎఫ్ అధికారులు ధర్మారం క్యాంపు నుంచి పామేడు వరకు రోప్ వేను ఏర్పాటు చేశారు. వాగు పడితే ఈ రోప్ వే నుంచి బలగాలు రాక పోకలు సాగిస్తారు. గత నెల నుంచి పనులు ప్రారంభించిన బలగాలు మంగళవారం పనులు పూర్తి చేశారు. బలగాలు ట్రయల్ రన్‌కూడా పూర్తి చేశారు. అలాగే స్థానికులు కూడా ఈ రోప్‌వే ద్వారా ప్రయానాలుకు సాగించ వచ్చునని అధికారులు చెబుతున్నారు. కాగా గత కొద్ది నెలల క్రితం ధర్మారం క్యాంపు పై మావోయిస్టులు బీజీఎల్స్ తో దాడి చేసిన విషయం తెలిసిందే.



చర్ల బలగాలు ఏర్పాటుచేసిన రోప్ వే

మానవత్వం పరిమళించిన వేళ

మతిస్థిమితం లేని యాచకుడికి సహకారం

భద్రాచలం, జూన్ 6: భద్రాచలంలో గత కొంత కాలంగా మతిస్థిమితం లేక యాచిస్తూ జీవిస్తున్న వ్యక్తికి భద్రాచలంకు చెందిన వ్యక్తులు సహకారం అందించారు. ఈ సమయంలో అతనికి స్నానం చేయించి నూతన వస్త్రాలు ధరింపజేశారు. అనంతరం అతనికి భోజనం పెట్టించి భద్రాచలంలోని సరోజని వృద్ధాశ్రమంలో చేర్చారు. కాగా ఆ వ్యక్తి గురించి పూర్తిస్థాయిలో ఆరా తీయగా మహబూద్ జిల్లా గార్లకు చెందిన శేఖర్‌గా గుర్తించారు. శేఖర్‌ను గుర్తించి స్నానం చేయించడమే కాకుండా నూతన వస్త్రాలు కొనుగోలు చేసి అతన్ని వృద్ధాశ్రమంలో చేర్చడానికి భద్రాచలంలోని చేతన మీ సేవ కేంద్రం నిర్వాహకులు రంజిత్‌నాయక్ భూక్య, మండలపల్లి రమేష్, నాగేంద్రబాబు, భీమ్‌సింగ్ సహకారం అందించారు. యాచకుడికి సపర్యలు చేసి, వృద్ధాశ్రమంలో చేర్పిన వారిని పలువురు అభినందించారు. ఇటువంటి చర్యలు ఎంతో అభినందనీయమని అన్నారు. వారు ఎందరికో స్ఫూర్తిగా నిలిచారని అన్నారు. కష్టకాలంలో ఉన్న వారిని ఆదుకోవడం దేవుడి సేవతో సమానమని అన్నారు.

'నెట్' పరీక్షల్లో తాటిగూడెం విద్యార్థి ప్రతిభ

కరకగూడెం, జూన్ 6 : మారుమూల ఏజెన్సీ గ్రామం నుంచి ఆల్ ఇండియా ఎస్టీ కెటగిరిలో 573వ ర్యాంక్ సాధించిన పోలెబోయిన రిషిత. కరకగూడెం మండలం తాటిగూడెం పంచాయితీ తాటిగూడెం గ్రామానికి చెందిన పోలెబోయిన గంగరాజు, ధనలక్ష్మి దంపతుల కుమార్తె అయిన రిషిత ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల కోసం ఎన్‌టీఏ దేశ వ్యాప్తంగా నిర్వహించిన నెట్ 2024 ప్రవేశ పరీక్షలలో మొత్తం 720 మార్కులకు గాను 596 మార్కులు సాధించి ఆల్ ఇండియా ఎస్టీ కోటాలో 573 ర్యాంక్ సాధించింది. అంతేకాక ఆల్ ఇండియా జనరల్ కోటాలో 85146 సాధించిన గిరిజన మహిళ రిషిత మారుమూల ఏజేన్సీ ఆణిముత్యంగా నిలిచింది. 573వ ర్యాంక్ సాధించిన రిషితను గ్రామస్థులు, ఉపాధ్యాయులు, అభినందించారు.




రిషిత

అభివృద్ధికి నోచుకోని..
స్తంభాద్రి ఆలయం



- కాకతీయుల కాలం నాటి ఆలయానికి వసతులు శూన్యం
- ఆదరణ కల్పించాలని మంత్రి తుమ్మలకు వినతి



ఆలయంలో చెక్కిన తాబేలు, చేప ఆకారాలు

ఖమ్మంసాంస్కృతికం, జూన్ 6: యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామి దేవాలయం తరువాత తెలంగాణలో అంతటి విశిష్ఠతను కలిగి ఉన్న ఖమ్మం స్తంభాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవాలయం. త్రేతాయుగం నాటి చారిత్రక, పురాతన దేవాలయాన్ని అనేక రాజ్యవంశాలు కొలిచితరించాయి.. 16వ శతాబ్దంలో ప్రతాపరుద్రుడు ఆలయాన్ని నిర్మించిన దేవాలయమిది. ఆలయ అభివృద్ధిపై పాలకులు ఎప్పటికప్పుడు హామీలకే పరిమితం కావడంతో రాష్ట్రంలోని ఇతర దేవాలయాల స్థాయి అభివృద్ధి ఈదేవాలయానికి దక్కడం లేదు.. అభివృద్ధికి ప్రాధాన్యమిచ్చే మంత్రి తుమ్మల హయాంలోనైనా ఆలయం ఆశించిన అభివృద్ధి దక్కుతుందని భక్తులు ఆశిస్తున్నారు..

దేవాలయం పేరునే...

ఈ దేవాలయం పేరునే ఖమ్మం పట్టణం ఏర్పడింది. కానీ ఖమ్మం ఉనికికి కారణమైన దేవాలయం మాత్రం ఎప్పటిలానే ఉంది.. స్తంభాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవాలయం పేరున స్తంభాద్రి, కంభాద్రి, ఖమ్మం మెట్టు, ఖమ్మం అనే పేర్లు స్థిరపడ్డాయి.. కాలక్రమేణా ఖమ్మంగా మార్పు చెందింది.. దేవాలయాన్ని విస్తరించి సౌకర్యాలు, సదుపాయాలు, తదితర దర్శణీయ అభిలాషను పెంపొందించే చర్యలు లేని కారణంగా చారిత్రక వైభవ ఘనత గత కాలానికే పరిమితం అవుతోంది.

కాకతీయు ప్రభువుల భక్తి చర్యలను చాటే విధంగా ఆలయ ఖ్యాతిని ఇనుమడింపజేసే చర్యలు లేవు.. ఆలయం చుట్టు పక్కలా గుట్ట ఆక్రమణలు యథేచ్ఛగా జరుగుతున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు వినవస్తున్నాయి.

దేవాలయం సువిశాలంగా రెండు మూడు ఎకరాల మేర విస్తరించిన సహజ సిద్ధ రాతి ప్రదేశం.. ప్రకృతి పరంగా ఏర్పడిన గుట్టపైభాగంలో లక్ష్మీనరసింహస్వామి స్వయంభువుగా వెలిశాడు.. గుట్టపై సహజంగా ఏర్పడిన కోనేరు భక్తులను ఆకట్టుకుంటుంది. కోనేటి నీళ్లతోనే స్వామి వారికి నిత్య అభిషేకాలతోపాటు ప్రసాదాల తయారీకి వినియోగించే సంప్రదాయం వందల ఏళ్లపాటు నుంచి కొనసాగుతుంది.

స్థల పురాణం..

త్రేతాయుగంలో మాద్గల్యమహాముని తన తపోనిష్ఠలో భాగంగా తన శిష్యులతో కలిసి ఈ కొండపైకి చేరి గుహభాగంలో తపస్సు చేశాడు.. అతడి భక్తికి మెచ్చి ప్రత్యక్షమైన స్వామి వరం కోరుకోమనగా మాద్గల్యమహాముని స్పందిస్తూ ఈ కొండపైనే లక్ష్మి సమేతుడివై కొలువుండమని కోరాడు.. స్వామి మహాముని భక్తికి మెచ్చి దక్షిణ ముఖంగా కొండపై గుహలో వెలిశాడు. ఆ తదుపరి వరంగల్. హైదరాబాద్ కేంద్రాలుగా విరాజిల్లిన అనేక రాజ్యవంశాలు ఈ దేవాలయాన్ని సందర్శించి పూజించినట్లు హరిభట్టు అనేక మహాకవి తన వరాహపురాణం గ్రంథంలో వివరించాడు.. రాజ్యవంశీకులలో కాకతీయ ప్రభువులు ఈ ఆలయం పట్ల దృష్టి సారించారు. వారిలో ప్రతాపరుద్రుడు 16వ శతాబ్దంలో దేవాలయ నిర్మాణానికి పూనుకున్నట్లు స్థల పురాణం తెలుపుతోంది.

అభివృద్ధి శూన్యం..

యాదాద్రికి సరి సమానంగా ఎంతో విశిష్టత కలిగి ఉన్న ఈ దేవాలయం ఆ స్థాయిలో అభివృద్ధికి, ప్రచారానికి నోచుకోవడం లేదు.. ఆలయంలో ఎంతో ప్రాచీన మైన కోనేరు నీళ్ల పాకుడు పట్టి శిథిల స్థితికి చేరింది. దీంతో ఈ నీటిని స్వామి వారి సేవలకు వినియోగించడంలేదు. ఈ కొండపై నుంచి ఖిల్లాకు రోప్ వే నిర్మిస్తామన్న హామీ అమలు కావడం లేదు. భక్తులు బస చేసేందుకు అనుగుణంగా సత్రాలు వంటివి నిర్మిస్తే ఇతర ప్రాంతాలకు చెందిన భక్తులు కల్యాణాలు, హోమాల్లో పాల్గొనే అవకాశం దక్కుతుంది.

ఎంతో మహిమగల దేవాలయం..

● నరసింహాచార్యులు, ప్రధాన అర్చకులు

స్తంభాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవాలయం ఎంతో మహిమను సంతరించుకుంది. స్వయంభువుగా వెలిసిన స్వామి భక్తులు కోరిన కోర్కెలు నెరవేరుస్తాడన్న నమ్మకం ఉంది. స్థల పురాణం ప్రకారం విశిష్టత కలిగి ఉన్న ఈ దేవాలయం ఆధ్యాత్మికంగానే కాక పర్యాటకంగా కూడా భక్తులను అలరిస్తుంది.

ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళతాం..

● కొత్తూరు జగన్మోహన్ రావు, ఆలయ ఈవో

ఉద్యోగులకు గానీ, ఆలయ నిర్వహణ పరంగా గానీ ఎటువంటి సమస్యలు లేవు.. అభివృద్ధి పనుల కోసం గతంలో పలుమార్లు ప్రజా ప్రతినిధులకు ప్రతిపాదనలుపంపించాం. అవి అమలు చేయాల్సి ఉంది.

16న జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ ఎంపికలు

ఖమ్మం స్పోర్ట్స్ జూన్ 6: నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలోని ఇండోర్ స్టేడియంలో ఈనెల 16న జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్. ఉప్పల్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికలను జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్- 11, 13, 15, 17, 19, బాలురు, బాలికల విభాగాలతో పాటు, మెన్ అండ్ ఉమెన్ ఏజ్ గ్రూప్ విభాగాలలో టోర్నీ కమ్ సెలెక్షన్స్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎంపికల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేసి, త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ ఎంట్రీలను ఈనెల 14 సాయంత్రం 4 కల్లా బ్యాడ్మింటన్ కోచ్ హరీష్‌కు నేరుగా, ఫోన్‌కు 81794 22953, 77320 61815 వాట్సాప్ ద్వారా అందించాలని తెలిపారు.

కథల పోటీలకు ఆహ్వానం

ఖమ్మంసాంస్కృతికం, జూన్ 6: హాసిని రామచంద్ర ఫౌండేషన్ (హెచ్ఆర్‌సీ) ఆధ్వర్యంలో జాతీయ స్థాయి ప్రోత్సాహకం కోసం కథలు కవిత్వాలను ఆహ్వానిస్తున్నట్లు నిర్వాహకురాలు తోట సుభాషిణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంస్థ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా ప్రముఖ సాహితీవేత్తకు హెచ్ఆర్‌సీ 2024 పురస్కారం అందజేయనుండటంతోపాటు కథకులు, కవుల రచనలకు బహుమతులతో ప్రోత్సహిస్తామన్నారు. జూలై నెలలో ఖమ్మంలో జరిగే కార్యక్రమంలో పురస్కార, బహుమతుల ప్రధానోత్సవం ఉంటుందన్నారు. ఆసక్తి గల కథా రచయితలు, కవులు తమ రచనలు నాలుగు సెట్లను ఈనెల 25 లోగా ఇంటి నెంబర్ 15-13- 309 బ్యాంకు కాలనీ, ఖమ్మం అనే చిరునామాకు పోస్టు చేయాలని కోరారు. కవితలు 25 లైన్లకు మించకుండా, కథలు డీటీపీలో నాలుగు పేజీలకు మించకుండా ఉండాలన్నారు. ప్రకృతి, పర్యావరణ పరిరక్షణ, తదితర అభ్యుదయ సామాజిక ప్రయోజనకర అంశాల ఇతివృత్తంగా కవితలు, కథలు ఉండాలన్నారు. ప్రముఖ సాహితీ వేత్తలైన కవి, రచయితలు జ్యూరీ సభ్యులుగా విజేతలను ఎంపిక చేస్తారని తెలిపారు.

పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలి



సమావేశానికి హాజరైన అధికారులు

కొత్తగూడెం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలను కల్పించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రియాంక అల అన్నారు. గురువారం పాఠశాలలో తీసుకోవాల్సిన అంశాలపై ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 6 నుంచి 19 వరకు బడిబాట కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా బడి వయస్సు పిల్లలందరిని పాఠశాలలో చేర్పించే విధంగా కార్యచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులు తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో కల్పించేసదుపాయాల మౌలిక వసతులు గురించి అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనే విధంగా సమన్వయంతో పని చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

జిల్లాలో 646 పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటి ద్వారా చేపట్టిన మరమ్మతులు అన్ని పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులు తమ పరిధిలోని పాఠశాలను ప్రత్యక్షంగా తనిఖీ చేసి పాఠశాల మరమ్మతులకు మంజూరైన నిధులు చేపట్టిన పనుల వివరాల నివేదికను అందచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో విద్యాచందన, అన్ని మండల ప్రత్యేక అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల్లో వేగం పెంచాలి

» జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్



మహిళలతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

కొణిజర్ల, జూన్6: అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల్లో వేగం పెంచి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ వీపీ. గౌతమ్ ఆదేశించారు. గురువారం కలెక్టర్ మండలంలోని అమ్మపాలెం, బస్వాపురం గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలకు మంజూరైన నిధులు, చేపట్టిన పనులు, ఎంతవరకు పూర్తి అయినది, ఇంకా పెండింగ్‌లో ఉన్న పనులు గురించి అడిగి తెలుసుకున్నారు. పూరైన పనులకు బిల్లులు వచ్చాయా, రాకపోతే వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలో జరుగుతున్న పనుల్లో విద్యుదీకరణ, టాయిలెట్ బ్లాకులు, తాగునీటి సరఫరాపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి పాఠశాలకు ప్రవేశద్వారం ఉండాలన్నారు. పాఠశాలలో విద్యార్థుల నమోదుశాతం పెరగాలని, ఆ విధంగా బడిబాటను విస్తృతంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కూడ ఇంగ్లీషు మీడియం బోధన జరుగుతుందని విద్యార్థుల తల్లిదండ్రులకు అర్థమయ్యేలా అవగాహన కల్పించి, విద్యార్థుల సంఖ్య పెరుగుదలకు కృషి చేయాలన్నారు. అనంతరం కొణిజర్లలో విద్యార్థులకు అందించాల్సిన యూనిఫాం తయారీని పరిశీలించి వారితో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీఈవో సోమశేఖర శర్మ, ఎంపీడీవో రోజారాణి, ఎంఈవో శ్యాంసన్, పాఠశాలల హెచ్ఎంలు యాసా వెంకటేశ్వరరావు, సీహెచ్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ కాలేజీలో 100మంది విద్యార్థుల ఎంపిక

ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 6: సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా ఏర్పాటు చేసిన కార్పొరేట్ విద్యా పథకంలో 2024-25 విద్యా సంవత్సరానికి 100 మంది విద్యార్థులను రిజర్వేషన్ల నిబంధనల మేరకు అధికారులు ఇటీవల ఎంపిక చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల విద్యార్థులకు కార్పొరేట్ విద్యలో అవకాశం కల్పించారు. గురువారం సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయంలో ధ్రువపత్రాల పరిశీలన కార్యక్రమం పూర్తి చేశారు. అనంతరం డిప్యూటీ డైరెక్టర్ కస్తాల సత్యనారాయణ 87 మంది విద్యార్థులకు కార్పొరేట్ కాలేజీ ఎంపిక ధ్రువపత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షకులు ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌లో 42 సైబర్ క్రైమ్ కేసుల పరిష్కారం

ఖమ్మం లీగల్ జూన్ 6: జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.రాజగోపాల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ లోక్‌అదాలత్‌లో భాగంగా గురువారం 42 సైబర్‌క్రైమ్ కేసులు పరిష్కరించారు. సైబర్ కేసుల ప్రత్యేక న్యాయాధికారి బి.రజని లోక్‌అదాలత్ బెంచ్‌కి అధ్యక్షత వహించి కేసులను పరిష్కరించారు. ఆన్‌లైన్ లావాదేవీల ద్వారా జరిపిన మోసాలలో డబ్బు కోల్పోయిన బాధితులు టోల్‌ఫ్రీ నెంబర్ ద్వారా చేసిన ఫిర్యాదులను స్వీకరించిన ఖమ్మం సైబర్ క్రైమ్ పోలీసులు నిందితుల బ్యాంక్ అకౌంట్లను జప్తు చేయడం ద్వారా బాధితుల డబ్బును కాపాడగలిగారు.

అయితే ఆ డబ్బు తాము తిరిగి పొందటానికి బాధితులు జిల్లా న్యాయసేవాధికారసంస్థను సంప్రదించగా సంస్థ కార్యదర్శి కె.వి.చంద్రశేఖర్‌రావు కేసులను లోక్ అదాలత్‌కు పంపించగా కేసులోని సంబంధిత పత్రాలను పరిశీలించిన లోక్ అదాలత్ బెంచ్ వారి డబ్బును తిరిగి ఇప్పిస్తూ లోక్ అదాలత్ అవార్డును జారీ చేసింది. లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ డీఎస్పీ ఫణీందర్, ఎస్ఐ రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

అక్రమంగా నిల్వ చేసిన ఇసుక సీజ్

గుండాల, జూన్ 6: అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను రెవెన్యూ అధికారులు గురువారం సీజ్ చేశారు. తహసీల్దార్ ఇమ్మానియేల్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ముత్తాపురం గ్రామ సమీపంలో ఇసుకను నిల్వ చేశారన్న సమాచారం మేరకు తనిఖీ చేశారు. సుమారు 900 క్యూబిక్ మీటర్ల ఇసుక అనుమతులు లేకుండా నిల్వచేసి ఉండటంతో, సీజ్ చేసి గిర్దావార్ పరివేక్షణలో ఉంచడం జరిగిందని తెలిపారు.

కొత్తూరు అంగన్‌వాడీలో చోరీ

నేలకొండపల్లి, జూన్6: మండల పరిధిలోని మంగ్రాజుపల్లి కొత్తూరు అంగన్‌వాడీలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. వివరాల ప్రకారం.. అంగన్‌వాడీ ఆలగడప మంగమ్మ గురువారం ఉదయం కేంద్రం తెరవటానికి వెళ్లేసరికి తలుపులు పగులగొట్టి ఉన్నాయి. కేంద్రంలోని గ్యాస్ సిలిండర్, చిన్నారులకు వంట చేసి పెట్టే పాత్రలు కనిపించలేదు. దీంతో వెంటనే సూపర్‌వైజర్‌కు సమాచారం అందించింది. అంగన్‌వాడీ టీచర్ ఆలగడప మంగమ్మ గురువారం ఉదయం నేలకొండపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

నాగులవంచ మద్యం దుకాణంలో..

చింతకాని, జూన్ 6: మండల పరిధిలోని నాగులవంచ గ్రామంలోని లక్ష్మీ నరసింహస్వామి మద్యం దుకాణంలో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం అర్ధరాత్రి సమయంలో మద్యం దుకాణం తాళాలు ధ్వంసం చేసి, దుకాణంలో ఉన్న సుమారు రూ. 1,33,760 విలువ గల మద్యం సీసాలను దొంగిలించారు. మద్యం దుకాణంలో పనిచేస్తున్న క్యాషియర్ మడుగుల భిక్షం ఫిర్యాదు మేరకు ఎస్ఐ నాగుల్‌మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తిరుమలాయపాలెం, జూన్6: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని పిండిప్రోలు గ్రామానికి చెందిన కాంపాటి రమేష్(48) వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. మే 31న ద్విచక్రవాహనంపై ఖమ్మం వెళ్లి ఇంటికి వస్తుండగా పిండిప్రోలు సమీపంలోకి రాగానే ప్రమాదవశాత్తూ కిందపడ్డాడు. దీంతో అతడికి తీవ్రగాయాలు కావడంతో వైద్య చికిత్స నిమిత్తం హైదరాబాదులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడున్నారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ గిరిధర్‌రెడ్డి తెలిపారు.

తలసేమియా వ్యాధితో విద్యార్థి..

దుమ్ముగూడెం, జూన్ 6: తలసేమియా వ్యాధితో విద్యార్థి మృతిచెందిన సంఘటన మండలంలోని పైడాకులమడుగులో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఆదివాసీ విద్యార్థిని సోడి సీతామహాలక్ష్మి(16) తలసేమియా వ్యాధితో కొంతకాలంగా బాధపడుతుంది. ఈ క్రమంలో హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. విద్యార్థిని మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

సెలూన్ షాపుపై దాడి

నేలకొండపల్లి, జూన్6: నేలకొండపల్లిలోని పీఎస్సార్ సెంటర్లో ఉన్న ఓ సెలూన్ షాపుపై తిరుమలాయపాలెం మండలం బచ్చోడుకు చెందిన కొంతమంది వ్యక్తులు గురువారం దాడికి పాల్పడ్డారు. దాడిలో సెలూన్ షాపు అద్దాలు ధ్వంసం అయ్యాయి. బచ్చోడుకు చెందిన ఓబాలికను నేలకొండపల్లి సెలూన్ షాపులో పని చేస్తున్న శేఖర్ అనే యువకుడు తీసుకొచ్చాడన్న ఆగ్రహంతో బాలికకు సంబంధించిన వ్యక్తులు షాపుపై దాడికి పాల్పడ్డారు. కాగా ఆ యువకుడు లేకపోవడంతో వెనక్కి వెళ్లిపోయారు. సమాచారం అందుకున్న నేలకొండపల్లి పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. బాలికను తీసుకొచ్చాడన్న ఆరోపణలు వచ్చిన యువకుడిని వెంటనే అప్పగించాలని షాపు యజమానిని పోలీసులు సూచించారు.

ఫారెస్టు భూములను ఆక్రమిస్తే చర్యలు: ఎఫ్‌డీవో

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మణుగూరు, జూన్ 6: ఫారెస్టు భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఫారెస్టు శాఖ డివిజనల్ అధికారి సయ్యద్ మక్సూద్ మోహిద్దీన్ హెచ్చరించారు. గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన అటవీ భూముల ఆక్రమణకు అనే వార్తకు స్పందించి మణుగూరు మునిసిపాలిటీ పరిధిలోని కమాలపురం గ్రామంలో అటవీ భూములను పరిశీలించారు. గ్రామంలో స్థానికుల సమావేశాన్ని ఏర్పాటు చేసి అటవీభూముల ఆక్రమణలకు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలను తీసుకోవాల్సి వస్తోందని తెలిపారు. అడవులను కాపాడాలి కానీ, ఇలా చెట్లు నరుకుంటూ పోవడం సరికాదని హెచ్చరించారు. అలాగే ఈ ప్రాంతంలో ఆక్రమంగా నిర్మించిన షెడ్లను తొలగించాలని సూచించారు. ఫారెస్టు శాఖకు సంబంధించి రిజ్వర్డ్ ఫారెస్టు పరిధి ప్రాంతం వరకు తమ సిబ్బంది తో హద్దులను కేటాయింపజేశారు. ఎక్స్‌కవేటర్ సాయంతో ఆక్రమిత భూములను గురించి ఫారెస్టుశాఖ తరుపున కేటాయించిన స్థలంలో చొరబాట్లు జరగకుండా కాలువ (ట్రెంచ్)ను కొట్టించారు. ఫారెస్టు ట్రెంచ్ దాటి వచ్చి ఏలాంటి ఆక్రమణ పనులు చేపట్టినా అట్టి వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. మరి కొద్ది రోజుల్లోనే ఇక్కడ ప్లానిటేషన్ పనులు చేపట్టాలని రేంజర్ ద్వాల్యాకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో స్థానికంగా ఫారెస్టు భూములను ఆక్రమించి వ్యాపారం చేసే వారికి చెక్ పడినట్లైంది. ఫారెస్టు రేంజర్, సెక్షన్, బీట్ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



కమలాపురంలో ఫారెస్టు హద్దును సూచిస్తూ కందకాలను ఏర్పాటు చేసిన అధికారులు



గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎఫ్‌డీవో మోహిద్దీన్

నిబంధనల మేరకు వాహనాలు నడపాలి

● ఎంవీఐ యోగేశ్వర్ జాదవ్



బస్సును తనిఖీ చేస్తున్న ఎంవీఐ యోగేశ్వర్ జాదవ్

సత్తుపల్లిరూరల్, జూన్6: పాఠశాల, కళాశాలల యజమానులు నిబంధనల మేరకు వాహనాలను నడపాలని సత్తుపల్లి ఎంవీఐ యోగేశ్వర్ జాదవ్ అన్నారు. పాఠశాలలు తెరుచుకునే రోజులు దగ్గర పడుతుండటంతో రవాణా శాఖ కార్యాలయం పరిధిలోని ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు చెందిన వాహనాలను ఆయా యాజమాన్యాలు గురువారం స్థానిక ఎంవీఐ కార్యాలయానికి తీసుకువచ్చారు. ఈ క్రమంలో వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే అనుమతులు జారీ చేస్తామని పేర్కొన్నారు. విద్యా సంస్థల పేరు, ఫోన్ నంబర్‌తో పాటుగా పూర్తి చిరునామా బస్సు ముందు ఎడమ వైపున ఉండాలని సూచించారు. వాహనం నడిపే డ్రైవర్ వయస్సు 60ఏళ్లలోపు ఉండి డ్రైవర్ బీపీ, షుగర్, కంటిచూపునకు సంబంధించి వివరాలు తెలిపే పట్టిక కచ్చితంగా ఉండాలని పేర్కొన్నారు. బడి బస్సులలో సీటింగ్ సామర్థ్యం మేరకే పిల్లలను ఎక్కించాలని ఆదేశించారు. ఆయిదేళ్ల బస్సును నడిపిన అనుభవం డ్రైవర్‌కు ఉండి తీరాల్సిందేనన్నారు. అదేవిధంగా పాఠశాలలు తెరిచేలోగా బస్సులకు ఎఫ్‌సీల పునరుద్ధరణ చేయించుకోవాలని సూచించారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు



అనాథ మృతదేహాల వద్ద నివాళులర్పిస్తున్న అన్నం సేవా సంస్థ సభ్యులు

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 6: అన్నం సేవా సంస్థ సభ్యుల ఆధ్వర్యంలో గురువారం మూడు అనాథ శవాలకు అంత్యక్రియలు నిర్వహించారు. ఇటీవల ఖమ్మం రైల్వే పోలీస్ పరిధిలోని రైలు పట్టాల వద్ద గుర్తు తెలియని రెండు(మగ) మృతదేహాలు, అదే విధంగా ఖమ్మం టూ టౌన్ పోలీస్ పరిధిలోని లభ్యమైన గుర్తు తెలియని మరో మృతదేహం లభ్యం కాగా పోలీస్ అధికారులు ఖమ్మం ప్రభుత్వ వైద్యశాల మార్చురీకి తరలించి భద్రపరిచారు. ఈ మూడు మృతదేహాల కోసం ఎవరూ రాకపోవడంతో గుర్తు తెలియని మృతదేహాలుగా భావించి రైల్వే, ఖమ్మం టూ టౌన్ పోలీసుల సమాచారం మేరకు ఖమ్మం నగరానికి చెందిన అన్నం సేవాట్రస్ట్ సభ్యులు నగరంలోని బల్లేపల్లి వైకుంఠధామానికి తరలించి దహన సంస్కారం చేశారు. ఈ కార్యక్రమంలో అన్నంసేవా ట్రస్టు చైర్మన్ అన్నం శ్రీనివాసరావుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు..

ఖమ్మంచర్చికాంపౌండ్: ఖమ్మం నగరంలోని త్రీటౌన్ ఏరియాలో గురువారం భిక్షాటన చేసే వృద్ధుడు రోడ్డు పక్కన మృతి చెందగా స్థానికులు ఇది గమనించి బాలు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో వారు స్పందించి నగరంలోని ప్రకాష్‌నగర్ వైకుంఠధామంలో ట్రస్టు ఆధ్వర్యంలో వృద్ధుడికి అంత్యక్రియలు నిర్వహించారు.

ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తవద్దు

- రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనులు వేగిరం చేయాలి
- లిఫ్ట్, ఎస్కలేటర్ల నిర్వహణ సజావుగా ఉండాలి
- సికింద్రాబాద్ రైల్వే డీఆర్ఎం గోపాల్‌నాయక్
- ఖమ్మం రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనుల పరిశీలన



రైల్వే స్టేషన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

ఖమ్మం మామిళ్లగూడెం, జూన్ 6: 'అభివృద్ధి పనుల నేపథ్యంలో ఏ ఒక్క ప్రయాణికుడు కూడా ఇబ్బంది పడొద్దు.. అన్ని చర్యలు తీసుకోవాలి' అని సికింద్రాబాద్ రైల్వే డివిజనల్ మేనేజర్ (డీఆర్ఎం) ఎం.గోపాల్‌నాయక్ ఆదేశించారు. గురువారం ఆయన ఖమ్మం రైల్వేస్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా అమృత్ భారత్ పథకం కింద రూ.25 కోట్లతో చేపట్టిన ఖమ్మం రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులను తనిఖీ చేశారు. టికెట్ కౌంటర్ల వద్దకు వెళ్లి అక్కడ ప్రయాణికులతో మాట్లాడారు. టిక్కెట్ కోసం వేచి ఉండకుండా కౌంటర్లను పెంచి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు.

ఫ్లాట్‌ఫారాలపై లిఫ్ట్, ఎస్కలేటర్ల పనితీరును పరిశీలించారు. రైళ్ల రాకపోకల సమయంలోనే కాకుండా ప్రయాణికులకు అనుకూలంగా వీటిని నిర్వహించాలన్నారు. లిఫ్ట్, ఎస్కలేటర్ నిర్వహణకు కూడా ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలని సూచించారు. ఆ తర్వాత గూడ్స్ షెడ్ ప్రాంతానికి వెళ్లి అక్కడ హమాలీలకు విశ్రాంతి గదులు పరిశీలించారు. ఖమ్మంస్టేషన్‌లో మూడో లైన్ కోసం కేటాయించిన స్థలాన్ని, పనులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట డి.సుబ్రహ్మణ్యం, సీనియర్ డీసీఎం వై.బాలాజీ కిరణ్, సీనియర్ డీఎస్టీఈ ప్రియా అగర్వాల్, సీనియర్ డీఈఎన్ దినాకర్ ప్రణీత్, సీనియర్ డీఈఈ ఎస్ఎస్‌వీ ప్రసాద్, డీవోఎం మణికుమార్, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జాఫర్, స్టేషన్ మేనేజర్ పీఎస్‌వీ ప్రసాద్, హెచ్ఐ మోహన్‌కుమార్, ఎస్ఎస్ఈ ఎలక్ట్రికల్ రాంనివాస్, విశ్వజిత్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

విత్తన దుకాణాలపై దాడులు



రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

ములకలపల్లి, జూన్ 6: ములకలపల్లి మండలంలో విత్తన దుకాణాలపై వ్యవసాయశాఖాధికారి, ట్రాన్స్ ఫోర్స్ ఎస్ఐ రాజ్‌కుమార్ గురువారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. విత్తనాలను విక్రయించేటప్పుడు డీలర్లందరూ బిల్లులను తప్పనిసరిగా రైతులకు ఇవ్వాల్సిందిగా వారికి సూచించారు. నాణ్యమైన విత్తనాలను మాత్రమే విక్రయించాలని ఆదేశించారు. రైతులందరూ లైసెన్స్ పొందిన దుకాణాల్లో మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని అన్నారు. పూర్తి వివరాలు ఉన్న బిల్లులను పొంది పంట కాలం పూర్తి అయ్యే వరకు తమ వద్ద భద్రపర్చుకోవాల్సిందిగా సూచించారు. తనిఖీల్లో కానిస్టేబుల్ రామకృష్ణ ఉన్నారు.

వడదెబ్బతో బీటీపీఎస్ ఉద్యోగి మృతి

పాల్వంచ, జూన్ 6: వడదెబ్బతో బీటీపీఎస్ ఉద్యోగి మృతి చెందిన సంఘటనపై పాల్వంచ టౌన్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. భద్రాద్రి జిల్లా పాల్వంచలోని గట్టాయిగూడెంలో తన భర్తతో కలిసి నివాసముంటున్న చాట్ల రాధ మణుగూరులోని బీటీపీఎస్ కార్మాగారంలో జూనియర్ ప్లాంట్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తోంది. ఈ క్రమంలో వడదెబ్బకు గురై గురువారం ఉదయం నీరసంగా ఉందని ఇంట్లోనే ఉంది. దాంతో ఆమె భర్త రజనీకాంత్ మధ్యాహ్నం వేళ ఆర్ఎంపీని తీసుకురావడానికి బయటకు వెళ్లగా రాధ అతడికి ఫోన్ చేసి వెంటనే ఇంటికి రమ్మని చెప్పింది.


అతడు ఇంటికి వెళ్లేసరికి రాధ అపస్మారక స్థితిలో ఉండటంతో వెంటనే కేటీపీఎస్ ఆసుపత్రికి తరలించాడు. పరీక్షించిన వైద్యులు ఆమె అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. తన కుమార్తె వడదెబ్బతో మృతి చెంది ఉంటుందని రాధ తండ్రి చాట్ల సైదులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పాల్వంచ టౌన్ ఎస్ఐ బానాల రాము తెలిపారు.

భర్త వేధిస్తున్నాడని మహిళా కార్పొరేటర్ ఫిర్యాదు

ఖమ్మం క్రైం జూన్ 6: కొంతకాలంగా భర్త వేధిస్తున్నాడని ఖమ్మం నగరానికి చెందిన ఓ మహిళా కార్పొరేటర్ గురువారం పోలీసులను ఆశ్రయించినట్లు సమాచారం. నగరానికి చెందిన ఒక మహిళా కార్పొరేటర్‌ను తన భర్త వేరే మహిళతో కొంతకాలంగా వివాహేతర సంబంధం పెట్టుకొని ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిసింది. ఈ విషయమై సదరు కార్పొరేటర్ నగర పోలీస్ అధికారిని ఆశ్రయించగా, ఖమ్మం మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించినట్లు తెలిసింది. దీంతో ఆమె మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు పోలీసులు భర్తను పిలిచి కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ఆమెకు చెప్పినట్లు సమాచారం.

పేకాటరాయుళ్ల అరెస్ట్

సుజాతనగర్, జూన్ 6: పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసిన ఘటన సుజాతనగర్ మండల పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. మండల పరిధిలోని కోమటిపల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేశారు. పేకాట ఆడుతున్న 11 మందిని పట్టుకుని, రూ.1,400/ నగదు స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జుబేదా బేగం తెలిపారు.



సహాయానికి వైకల్యం అడ్డుకాదు..

ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 6: మానవత్వంతో సహాయం చేసేందుకు వైకల్యం అడ్డకాదని ఓ దివ్యాంగుడుకి మరో దివ్యాంగుడు సహాయం చేసి వైకల్యం అడ్డుకాలేని చాటుకున్నారు. ఖమ్మం నగరంలోని ముస్తాఫానగర్‌కు చెందిన ఓ దివ్యాంగుడు మూడు చక్రాల వాహనం ఖమ్మం బైపాస్‌రోడ్డులో మరమ్మతులకు గురై నిలిచిపోయింది. అసలే వైక్యలంతో ఉండటంతో వాహనాన్ని ముందుకు కదలించటం కష్టంగా మారింది. ఇదే సమయంలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న మరో దివ్యాంగుడు అటువైపుగా వచ్చి నిలిచిపోయిన వాహానాన్ని దివ్యాంగుడుతో సహా ముందుకు నెడుతూ సహాయం అందించారు. ఈ దృశ్యాలను 'ఆంధ్రజ్యోతి' కెమెరాలో బంధించింది.



ఆగిన త్రిచక్రవాహాన్ని మరో దివ్యాంగుడు నెడుతున్న దృశ్యం

ప్లాస్టిక్ నిషేధంపై దృష్టి ఏది?

- యథేచ్ఛగా ప్లాస్టిక్ వినియోగం
- డంపింగ్ యార్డుల్లా కాలువలు
- దాడులు మరిచిన కార్పొరేషన్ అధికారులు

ఖమ్మంకార్పొరేషన్, జూన్ 6: ప్లాస్టిక్ నిషేధం ప్రకటనలకే పరిమితమవుతున్నది. గతంలో నగరపాలకసంస్థ అధికారులు దాడులు చేసి, నిషేధిత ప్లాస్టిక్ వాడే వారికి జరిమానాలు విధించారు.తరువాత పట్టించుకోకపోవటంతో నగరంలో ప్లాస్టిక్ వినియోగం పెరుగుతున్నది. కూరగాయలు, పండ్లు తదితరాలను నిషేధిత ప్లాస్టిక్ కవర్లలోనే వేస్తున్నారు.

వినియోగం.. కాలువల్లో పడవేస్తూ...

నిషేధిత ప్లాస్టిక్‌ను వినియోగించటమే కాకుండా, వినియోగించిన వాటిని డ్రెయినేజీ కాలువల్లో పడేస్తున్నారు. సదరు ప్లాస్టిక్‌ను జంతువులు తిని అకాల మరణానికి గురవుతున్నాయి. ప్లాస్టిక్‌ను డంపింగ్‌యార్డులో పనిచేయటం వల్ల వ్యర్థాలు పేరుకుపోయి, రీసైక్లింగ్ కూడా చేసేందుకు వీలు కావటం లేదు. డంపింగ్‌యార్డులో చెత్తను గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడం వల్ల ప్లాస్టిక్ వ్యర్థాలు కాలి త్వరగా చల్లారటం లేదు. ఫలితంగా పొగ విపరీతంగా వ్యాపించి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

రహదారుల పక్కనే వ్యర్థాల డంపింగ్

ప్లాస్టిక్ సంబంధిత వ్యర్థాలను రహదారుల పక్కనే డంపింగ్ చేస్తున్నారు.



రహదారి పక్కనే వేసిన ప్లాస్టిక్ వ్యర్థాలు

నగరపాలకసంస్థ అధికారులు జరిమానాలు విధిస్తున్నా పట్టించుకోవడం లేదు. అయితే నగరపాలకసంస్థ అధికారులు ప్లాస్టిక్ నిషేధంపై దృష్టి సారించకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందనే విమర్శలు వస్తున్నాయి. నగరపాలకసంస్థ అధికారులు గతంలో తరచూ దాడులు చేయటమే కాకుండా, నిషేధిత ప్లాస్టిక్ సంచులు తీసుకెళ్లే వారికి క్లాత్‌తో చేసిన సంచులు ఇస్తూ అవగాహన కల్పించేవారు. దుకాణాలను తనిఖీ చేసి, నిషేధిత ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకునే వారు. ప్రస్తుతం ఎన్నికల హడావుడి ముగిసిన నేపథ్యంలో అధికారులు నిషేధిత ప్లాస్టిక్ వినియోగంపై దృష్టి పెడితే ప్లాస్టిక్ వినియోగం తగ్గుతుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

నాణ్యతకు తిలోదకాలు

- నాసిరకంగా డ్రైయినేజీ నిర్మాణం
- అధిక మోతాదులో డస్ట్, నాణ్యతలేని కంకర వినియోగం
- పట్టించుకోని అధికారులు

ఖమ్మం ఖానాపురంహవేలి జూన్ 6: ఖమ్మం కార్పొరేషన్ ఒకటవ డివిజన్ కైకొండాయిగుడెంలో గత కొన్ని రోజులుగా నిర్వహిస్తున్న డ్రెయినేజీ నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలు పాటించకుండ, అధిక మొత్తంలో డస్ట్ వాడుతూ నిర్మాణం చేపడుతున్న ఓ గుత్తేదారుడు. డివిజన్‌లోని పందుల వారి వీధి నుంచి కాలనీ వరకు సుమారు 670 మీటర్ల పొడవుతో, రూ.60 లక్షల కార్పొరేషన్ నిధులతో ఈ డ్రెయినేజీ పనులు నిర్వహిస్తున్నారు. పనులు చేపట్టిన కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలు పాటించకుండా ఇష్టారాజ్యంగా అస్తవ్యస్తంగా చేపట్టినట్లుగా స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. పనుల్లో నాణ్యమైన సిమెంట్, కంకర,ఇసుక ఇంజనీరింగ్ ప్లాన్ ప్రకారం వాడాల్సినంతగా వాడకుండా అధిక మొత్తంలో డస్ట్ వాడుతూ తూతుమంత్రంగా పనులు చేస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. డ్రెయినేజీ నిర్మాణం చేపట్టిన నాటి నుంచి వాటర్ క్యూరింగ్ సకాలంలో చేపట్టకపోవడంతో ఆదిలోనే హంసపాదు అన్నట్లుగా పగుళ్లు తెలుతున్నట్లుగా స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. కొన్ని చోట్ల పగుళ్లరాగా వాటికి ప్యాచ్ వర్కులు చేశారని స్థానికులు వాపోతున్నారు. డ్రెయినేజీ అడుగు భాగంలో కంకరతో ఫిక్సింగ్ చేయకుండా సిమెంట్, డస్ట్ అదికూడా నామమాత్రంగా వేసినట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి.పనులపై పర్యవేక్షణ చేయాల్సిన ఇంజనీరింగ్ అధికారులు ఆటువైపు కన్నెత్తి చూడలేదని, కారణం గుత్తేదారు ఇచ్చే



ఇసుక లేకుండ కంకర, డస్ట్ వాడుతున్న దృశ్యం

అమ్యామ్యాలకు తలొగ్గడమేననే విమర్శలు వినపడుతున్నాయి. పది కాలాలపాటు అగాల్సిన డ్రెయినేజీ మూణ్నాళ్ల ముచ్చటగా మారే ప్రమాదం ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పర్యవేక్షణ చేసి డ్రెయినేజీ పనులు పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు.

పనులు అస్తవ్యస్తంగా ఉన్నాయి

తిరుపతిరావు కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు



డ్రెయినేజీ పనులు అస్తవ్యస్తంగా నిర్వహించారు. పనులు జరిగినప్పుడు సంబంధించిన అధికారుల పర్యవేక్షణ లేదు. నాణ్యతగా చేపట్టాలని మిల్లర్ పనులు చేసేవారిని నిలదీస్తే మీరు ఎక్కడైనా చెప్పండి ఇలాగే చేస్తామని దురుసుగా మాట్లాడారు. పనులు చేసిన కాంట్రాక్టర్‌పై అధికారులు చర్యలు తీసుకోవాలి.

చెరువులను పరిశీలించిన ఎమ్మెల్యే



రికార్డు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి, జూన్ 6: సత్తుపల్లి మండలంలోని బేతుపల్లి పెద్ద చెరువు, గంగారంలోని చెరువులను సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్‌లు గురువారం పరిశీలించారు. బేతుపల్లి పెద్ద చెరువు వద్ద బతుకమ్మ, గణేష్ నిమజ్జనాలకు వీలుగా ర్యాంపు నిర్మాణం, గంగారం చెరువువద్ద పార్కు అభివృద్ధికి గల అవకాశాలను పరిశీలించాలని జలవనరుల శాఖ అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. చెరువు శిఖం భూములు ఆక్రమణకు గురయ్యాయని ఎమ్మెల్యేకు కొందరు ఫిర్యాదు చేయగా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులకు చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించండి: డీఈ

సత్తుపల్లిరూరల్, జూన్ 6: డివిజన్ పరిధిలోని విద్యుత్ సమస్యలను శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి వెంటనే పరిష్కరించాలని ట్రాన్స్‌కో డీఈ రాములు అన్నారు. గురువారం సత్తుపల్లి పట్టణంలోని ఎన్టీఆర్ నగర్‌లో వినియోగదారులు ఇచ్చిన పలు విద్యుత్ సమస్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉందా, ఓవర్ లోడ్‌తో లో ఓల్టేజీ వస్తుందా, తీగలు వదులుగా ఉండి తాకే విధంగా ఉన్నాయా, ఇంటి మీటర్లు సరిగ్గా పనిచేస్తున్నాయా లేదా, అధిక బిల్లులు, ఆన్‌లైన్‌లో చెల్లింపులు, గృహజ్యోతి పథకం తదితర అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. స్థానికులు సైతం ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూతా చెత్తాచెదారం వేయొద్దని సూచించారు. కార్యక్రమంలో ఏఈ శరత్‌బాబు, సిబ్బంది ప్రసాద్, మస్తాన్ ఉన్నారు.

'దోస్త్' రెండో దశ అడ్మిషన్లు ప్రారంభం

మధిర, జూన్ 6: మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దోస్త్ రెండో దశ అడ్మిషన్లు గురువారం నుంచి ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ ఏఎల్ఎన్ శాస్త్రి తెలిపారు. మధిరలో ఈ సంవత్సరం నుంచి సైన్సు సెక్షన్లు మంజూరయినందున విద్యార్థులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డిగ్రీలో చేరదల్చుకున్న వారు సంబంధిత సర్టిఫికేట్లతో వస్తే అడ్మిషన్ల ప్రక్రియ పూర్తిచేయడం జరుగుతుందని ఇంకా ఏమైనా సందేహాలు ఉంటే కో ఆర్డినేటర్ జీ అరుణను సంప్రదించాల్సిందిగా సూచించారు.

నూతన చట్టాలపై సంపూర్ణ అవగాహన అవసరం: ఏసీపీ

ఖమ్మం రూరల్, జూన్ 6: నూతన చట్టాలపై పోలీసు సిబ్బంది సంపూర్ణ అవగాహన పెంచుకోవాలని ఏసీపీ వెంకటేష్, సాంబరాజు తెలిపారు. మండల పరిధిలోని పెద్దతండాలోని ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో నూతన చట్టాలపై పోలీస్ సిబ్బందికి గురువారం అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతు జూలై 1నుంచి భారత ప్రభుత్వం నూతన నేర న్యాయ చట్టాలు-2023 అమలులోకి తేనున్న నేపథ్యంలో పలు కేసుల నమోదు, దర్యాప్తు, విచారణలో పాటించాల్సిన నూతన విధానాలపై సిబ్బందికి పూర్తి పరిజ్ఞానం ఉండాలన్నారు. భారత న్యాయ వ్యవస్థ ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నదన్నారు. ఇప్పుడు అమలులోకి రానున్న నూతన చట్టాలు భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్యా అధినియం వంటి అంశాలతో శాంతిభద్రతల పరిరక్షణలో మైలురాయిగా నిలుస్తోందన్నారు. నూతన చట్టాల ద్వారా కేసుల దర్యాప్తు, విధానాలు విచారణ పద్ధతుల్లో మార్పు వస్తుందని, ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించేందుకు వీలు దొరుకుతుందన్నారు. ప్రతి ఒక్కరు నూతన అంశాలను నేర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీదర్, ఎస్ఐలు శ్రీనివాస్, ప్రవీణ్ కుమార్, గిరిధర్ రెడ్డి, ఖాషకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ లైన్‌మెన్‌కు సన్మానం

వైరా, జూన్ 6: ఖమ్మం సర్కిల్, వైరా డివిజన్, వైరా సెక్షన్‌లో లైన్‌మెనగా పనిచేస్తున్న డిస్కమ్ కమిటీ మెంబర్, వైరా డివిజన్ నాయకులు, వైరా లైన్‌మెన్ కృష్ణ ప్రసాద్ బెస్ట్ వర్కర్ అవార్డుకు ఎంపిక కావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తూ గురువారం లైన్‌మెన్ కృష్ణ ప్రసాద్‌ను సత్కరించారు. ఆనంతరం కృష్ణ ప్రసాద్ పలు అవార్డులు ఆందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో శ్రీరామినేని విజయభాస్కర్, మోరంపూడి ప్రసాద్, నల్లమల వీరభద్రరావు, కర్నాటి హనుమంతరావు, పఠాన్ జానీ, ఉదారపు పూర్ణ, కోటేశ్వరరావు, కృష్ణ, వినయ్, రణధీర్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.



లైన్‌మెన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

మజ్జిగ, స్వీట్లు పంపిణీ

కారేపల్లి జూన్ 6: తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ప్రజలకు మజ్జిగ. స్వీట్లు పంపిణీ కార్యక్రమం గురువారం కారేపల్లి మండల పరిధిలోనే కారేపల్లి క్రాస్‌రోడ్డులో జరిగింది. ఏపూరి శేషయ్య, రాంబాయమ్మల జ్ఞాపకార్థం గుడ్‌మార్నింగ్ గ్రూపు ఆధ్వర్యంలో ఈకార్యక్రమం జరిగింది. గ్రూపు అడ్మిన్ పుచ్చాకాయల శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అబినియనందం అన్నారు.కార్యక్రమాన్ని ఏపూరి లక్ష్మీనారాయణ భారతి దంపతులు ప్రారంబించారు.కార్యక్రమంలో ఏపూరి రంగయ్య, కిషన్ రావు, నాగేశ్వరావు,వీరయ్య, పలువురు గ్రూపు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టుయోధుడు చంద్ర రాజేశ్వరరావు: బాగం

ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 6: భారత కమ్యూనిస్టు పార్టీ అగ్రనేత దివంగత చంద్ర రాజేశ్వరరావు కమ్యూనిస్టు యోధుడని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు పేర్కొన్నారు. గురువారం సీపీఐ కార్యాలయం గిరిప్రసాద్ భవన్‌లో చంద్ర రాజేశ్వరరావు 111వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. బాగం మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో చంద్ర రాజేశ్వరరావు విరోచిత పోరాటం చేశారని, సీపీఐ జాతీయ కార్యదర్శిగా సుదీర్ఘకాలం పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేశారని గుర్తు చేశారు. అంకిత భావం కలిగిన కమ్యూనిస్టుగా కీర్తి సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమితి కార్యదర్శి పోటు ప్రసాద్, నాయకులు జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రా బాబు, పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, మేకల శ్రీనివాసరావు, రావి శివరామకృష్ణ, గాదె లక్ష్మీనారాయణ, తాటి నిర్మల, పగిడిపల్లి ఏసు, ఇటికాల రామకృష్ణ, మేకల రవి పాల్గొన్నారు.

ట్యాంక్‌బండ్‌పై సీసీ కెమెరాల ఏర్పాటు

ఖమ్మంకార్పొరేషన్, జూన్ 6: ఎట్టకేలకు లకారం ట్యాంక్‌బండ్‌పై సీసీ కెమేరాలను ఏర్పాటు చేశారు. ఇక్కడకు సందర్శకులు ఎక్కువగా వస్తున్నప్పటికీ సీసీ కెమేరాలు లేకపోవటంతో అధికారుల పర్యవేక్షణ కరువైంది. ఈ నేపథ్యంలో గురువారం ట్యాంక్‌బండ్‌పై సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.

కార్పెంటర్స్ యూనియన్ సత్తుపల్లి అధ్యక్షుడిగా లక్ష్మాచారి



ఎన్నికైన నూతన కమిటీ

సత్తుపల్లిరూరల్, జూన్6: సత్తుపల్లి కార్పెంటర్స్ యూనియన్ అధ్యక్షుడిగా వెలిశాల లక్ష్మాచారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం పట్టణంలోని భవన నిర్మాణ కార్మికుల భవనంలో నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకొన్నారు. ఉపాధ్యక్షుడిగా ఉరిమెళ్ల సురేష్, కార్యదర్శిగా టీ.హరీష్. సహాయ కార్యదర్శిగా ఎస్‌కే.చిన్న బాబా, కోశాధికారిగా రుద్రాక్షల అప్పాచారి, సభ్యులుగా రథం మల్లాచారి, చంద్రగిరి ప్రసాద్, గుగ్గిళ్ల బాబు, లింగగిరి శివ, ఆయంచ కోటేశ్వరరావు, మేడిది కృష్ణమాచారి, మహారోజు ప్రకాష్, ఈడా రవి కృష్ణ, తంగెళ్లపల్లి ఈశ్వరాచారిలను ఎన్నుకొన్నారు. అదేవిధంగా కోదూరి మోహనాచారి, రుద్రాక్షల శ్రీనివాసాచారి, నంచర్ల రామాచారి, వెలిశాల నాగేంద్రాచారి, మొగుదుంపురం నరసింహాచారి, రామకృష్ణ, బాణాల కృష్ణప్రసాద్‌లు గౌరవాధ్యక్షులుగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా కార్పెంటర్ల సంక్షేమం, సమస్యలపై పలు తీర్మానాలు చేశారు.

బోనకల్‌లో 'కూటమి' సంబురాలు

బోనకల్, జూన్ 6: ఏపీలో కూటమి ఘన విజయం సాదించినందుకుగానూ బోనకల్‌లో గురువారం రాత్రి టీడీపీ, బీజేపీ, జనసేన, ఎంఆర్‌పీఎస్ నాయకులు విజయోత్సవ ర్యాలీని నిర్వహించారు. బాణాసంచా పేల్చి స్వీట్లు పంచారు. సంబరాలు చేసుకున్నారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాసిరెడ్డి రామనాథం మాట్లాడుతూ ఏపీలో రాక్షస పాలన అంతమైందని తెలిపారు. బాబు పాలనలో ఆంధ్రాలో సరికొత్త అధ్యాయం ప్రారంభమవుతుందని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు రావుట్ల సత్యానారాయణ, నందమూరి సత్యానారాయణ, గుగులోతు నాగేశ్వరావు, వీరపనేని అప్పారావు, గంగుల నాగయ్య, మందా అశోక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ నాయకుడు రామనాథం

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

- బడిబాట కార్యక్రమంలో అధికారులు

వైరా/సత్తుపల్లి/బోనకల్/తిరుమలాయపాలెం, జూన్ 6: మండలంలోని గొల్లెనపాడు ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు గురువారం అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ రాములమ్మ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులు ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం కల్పించే సదుపాయాలపై అవగాహన కల్పించారు. ప్రైవేటు ధీటుగా సర్కారు బడులలో విద్యాను బోధించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కేసీ వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు జె. పవన్ కుమార్, హనుమంతరావు పాల్గొన్నారు.



సత్తుపల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు

సత్తుపల్లి: ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని సత్తుపల్లిలోని గాంధీనగర్‌లో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ర్యాలీ, ప్రతిజ్ఞ చేశారు. బడిఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించేందుకు కృషి చేస్తామని పిల్లల తల్లిదండ్రులు ఉపాధ్యాయులకు చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం చక్రపాణి, ఉపాధ్యాయులు నరసింహారావు, వెంకటేశ్వరరావు, కుమారి, భాగ్యలక్ష్మి, వెంకటేష్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ శ్రీలక్ష్మి, ఎస్టీ హాస్టల్ సంక్షేమాధికారి బి.రాములు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బోనకల్: మండలంలోని అన్ని గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు గురువారం బడిబాట పట్టారు. గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. ప్రజా ప్రతినిధులు, తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ బడుల ప్రాధన్యతను వివరించారు. ప్రైవేటు వద్దు, ప్రభుత్వ బడి ముద్దు అన్న నినాదంతో పిల్లలను తమ బడులకు పంపించాలని విజ్ఞప్తి చేశారు. బడుల్లో చేపడుతున్న కార్యక్రమాలతో పాటు నాణ్యమైన విద్యను అందిస్తామని విద్యార్థుల తల్లి దండ్రులకు ఉపాధ్యాయులు హామి ఇచ్చారు.



వైరా మండలం గొల్లెనపాడులో ర్యాలీ

తిరుమలాయపాలెం: గ్రామీణ ప్రాంతాల్లో బడిఈడు పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో హాజరుశాతం పెంచేందుకు ప్రభుత్వం చేపట్టిన బడిబాట కార్యక్రమం మొక్కుబడిగా కొనసాగింది. మండలంలోని మొత్తం 75 పాఠశాలలుండగా ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం చేపట్టి ఇంటింటికి వెళ్లి బడిఈడుపిల్లలను గుర్తించారు.

మధిరలో అన్ని రైళ్లకు హాల్టింగ్ ఇవ్వాలి

- డీఆర్‌ఎంకు బీజేపీ నాయకుల విజ్ఞప్తి
- మధిర రైల్వే స్టేషన్‌ను సందర్శించిన గోపాల్‌నాయక్

మధిర, జూన్ 6: మధిర రైల్వే స్టేషన్‌ను డివిజనల్ రైల్వే మేనేజర్(డీఆర్‌ఎం) గోపాల్ నా యక్ గురువారం సందర్శించారు. రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న స్టేషన్ అభివృద్ధి పనులు, మూడో రైల్వేలైన్ నిర్మాణపనులను ఆయన పరిశీలించారు. పనుల పురోగతిపై ఇంజనీరింగ్ అధికారులనుంచి పలు వివరాలు అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. స్టేషన్ నిర్వహణ తీరును పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. స్టేషన్ మాస్టర్‌తోపాటు రైల్వే అధికారులు పాల్గొన్నారు.



మధిరలో మూడో లైన్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న డీఆర్‌ఎం

కొవిడ్‌కు ముందు రైళ్లన్నంటినీ ఆపాలి: బీజేపీ

మధిర రైల్వే స్టేషన్‌లో కొవిడ్‌కు ముందు ఉన్న అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లకు తిరిగి యథావిధిగా హాల్టింగ్ ఇవ్వాలని బీజేపీ నాయకులు డీఆర్‌ఎంను కోరారు. మధిర వచ్చిన ఆయనను బీజేపీ నాయకులు కలిసి స్టేషన్‌లో ప్రయాణీకులుపడుతున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. నవజీవన్ ఎక్స్‌ప్రెస్‌కు మధిరలో హాల్టింగ్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అలాగే మధిర పాత రైల్వే గేట్ సమీపంలో అండర్‌బ్రిడ్జి నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని కోరారు. ఈకార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ ఏలూరు నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి చిలువేరు సాంబశివరావు, పట్టణ అధ్యక్షులు పాపట్ల రమేష్, మండల అధ్యక్షులు గుండా చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైరా నియోజకవర్గంలో కాంగ్రెస్ హవా

- అత్యధికంగా కొణిజర్ల మండలంలో మెజార్టీ

వైరా, జూన్ 6: ఖమ్మం ఎంపీ ఎన్నికల్లో వైరా నియోజకవర్గంలోని ఐదుమండలాల్లో కాంగ్రెస్ హవా కొనసాగింది. ఐదు మండలాల్లో 61,778ఓట్ల మెజార్టీ లభించింది. అత్యధికంగా కొణిజర్ల మండలంలో 16,685ఓట్లు, సింగరేణిలో 15,390ఓట్లు, వైరాలో 13,840 ఓట్లు, ఏన్కూరులో 9,070ఓట్లు, జూలూరుపాడ్‌లో 6,793ఓట్ల మెజార్టీ కాంగ్రెస్‌కు లభించింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచిన రాందాస్‌నాయక్‌కు 33,045ఓట్లు రాగా, ఎంపీ ఎన్నికల్లో రఘురామిరెడ్డికి 61,778ఓట్ల మెజార్టీ లభించింది. ఎమ్మెల్యే ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రాందాస్‌నాయక్‌కు 93,913ఓట్లు రాగా, బీఆర్ఎస్ అభ్యర్థి మదన్‌లాల్‌కు 60,868ఓట్లు వచ్చాయి. బీజేపీ బలపర్చిన జనసేన అభ్యర్థికి 2,712ఓట్లు లభించాయి. ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రఘురామిరెడ్డికి 98,280ఓట్లు రాగా, బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావుకు 36,502ఓట్లు, బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోదరావుకు 11,806ఓట్లు లభించాయి.

2023 అసెంబ్లీలో వచ్చిన ఓట్లకన్నా.. 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పెరిగిన ఓట్లు

మండలం	కాంగ్రెస్		బీఆర్ఎస్		బీజేపీ
	లోక్‌సభ	అసెంబ్లీ	లోక్‌సభ	అసెంబ్లీ	లోక్‌సభ
సింగరేణి	22,823	20,283	7,433	14,763	2,939
జూలూరుపాడ్	13,089	12,253	6,296	9,784	1716
ఏన్కూరు	14,364	14,155	5,294	8,205	1708
కొణిజర్ల	26,431	24,617	9,746	15,148	3,203
వైరా	21,573	21,089	7,733	12,566	2,240
పోస్టల్		1516		412	
మొత్తం	98,280	93,913	36,502	60,868	11,806

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- నగరపాలకసంస్థ కమిషనర్ ఆదర్శ్‌సురభి
- పారిశుధ్య, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష

ఖమ్మంకార్పొరేషన్, జూన్ 6: రానున్న వర్షాకాలం దృష్ట్యా పారిశుధ్య ఇంజనీరింగ్ విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని నగరపాలకసంస్థ కమిషనర్ ఆదర్శ్‌సురభి కోరారు. గురువారం నగరపాలకసంస్థ కార్యాలయంలో కాలువల పూడికతీత పనులపై సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ డివిజన్లలో పూడుకుపోయిన కాలువలను గుర్తించి, సదరు సమస్యను సహాయ కమిషనర్ దృష్టికి తెస్తున్నారు. సహాయ కమిషనర్ తన దృష్టికి తెస్తున్నారు.. ఈ ప్రక్రియలో జాప్యం జరిగి సమస్య త్వరగా పరిష్కారం కావటంలేదని కమిషనర్ పేర్కొన్నారు. అందుకే సమస్యను గుర్తించిన శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వెంటనే ఇంజనీరింగ్ శాఖ ఏఈకి తెలియచేయాలని, వారు సమన్వయంతో పనిచేసి వెంటనే కాలువల పూడికతీత పనులను చేపట్టాలన్నారు. రానున్న వర్షాకాలంలో వానలు ఎక్కువగా పడతాయని, వాతావరణ శాస్త్రజ్ఞులు చెబుతున్న నేపథ్యంలో త్వరగా కాలువల పూడికతీత పనులను పూర్తిచేసి, నగరంలో వరద ముంపు రాకుండా చర్యలు చేపట్టాలని కోరారు.



సమీక్ష నిర్వహిస్తున్న నగరపాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్ సురభి

ముగిసిన క్రికెట్ వేసవిశిక్షణా శిబిరం

ఖమ్మం స్పోర్ట్స్, జూన్ 6: జిల్లా క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో మే 1 నుంచి ప్రారంభమైన వేసవి క్రికెట్ శిక్షణా శిబిరం గురువారం ముగిసింది. శిక్షణ పూర్తి చేసుకున్న క్రీడాకారులకు డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి, అథ్లెటిక్స్ కోచ్ గౌస్ వాలీబాల్ కోచ్ అక్బర్ అలీ, క్రికెట్ శిబిరం నిర్వాహకుడు ఫారూఖ్ తదితరులు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.